
AL - HILAL

నెలవంక

Vol 4 Issue: 14 November - 2007

مجلة الهلال - ملحق مجلة البشرى (باللغة التلغوية)





ఆంధ్ర ప్రదేశ్ అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు !

-ప్రత్యేక విభాగం 45 పేజీలో

IPC

لجنة التعريف بالإسلام

ISLAM PRESENTATION COMMITTEE

جمعية الهداية الخيرية

NELAVANKA
(Al-Hilal)
Monthly

నెలవంక

CHIEF PATRON
Muhd. Ismail Al-Ansari

CHIEF EDITOR
Muhd. Azeezur Rahman

ASSOCIATE EDITORS
Mujahid Khan Omeri
Syed Abdus Salam Omeri

EDITORIAL BOARD
Abdul Qadir Omeri
Shaikh Abdus Salam Omeri
Tahera Begum

Graphic Designer
Nader Bellal

PUBLISHED BY
Islam Presentation committee
Kuwait

PHONES
2444116 , 2444117
Extns :
110 Azeezur Rahman
106 Mujahid khan Omeri

FAX
2400057


EMAIL
nelavanka@ipc-kw.com


WEBSITE
www.ipc-kw.com


P.O. Box-1613
Safat-13017, KUWAIT


7


8


11


15


16-17

ఈ సంచికలో....

الفهرس

మరువ బోకుమా !	2	لا تنسوهم...!
మీరు గనక విద్యార్థులయితే !	3	إذا كنت طالبا...!
ఆంధ్ర ప్రదేశ్ అవతరణ...	4	كلمة بمناسبة تشكيل ولاية آندهرا برديش
ఇస్లాం కత్తి బలంతో వ్యాపించిందా?	7	هل الإسلام انتشر بالسيف؟ (بقلم صحافي الهندي)
విషాద సంవత్సరం	8	عام الحزن (تلخيص الرحيق المختوم)
విశ్వాసుల మాత జైనబ్ బిన్తె జహష్ (ర.అన్హా)	9	أم المؤمنين السيدة زينب بنت جحش رضي الله عنها
దైవ విధేయులుగానే బ్రతకండి...	10	ولا تموتن إلا وأنتم مسلمون
ధర్మ నిష్ఠకు గీటురాయి.	11	ركن التقوى
ఇస్లాం శిక్షణ	12	الإسلام دين عالمي
ఆస్తిపాస్తులు ఆలుబిడ్డలు	15	إنما أموالكم وأولادكم فتنة
ఐ.పి.సి న్యూస్	16	نشاط اللجنة (عيد الفطر)
భ్రమల వలయం !	18	كيف تتولد البدع والخرافات؟
ఓ మానవుడా !	19	يا أيها الإنسان...! (نشيده بقلم المهتدي)



నెలవంక ఉత్తరాలు



నెలవంక మా ప్రియ నేస్తం

గౌరవనీయులైన **నెలవంక** మాస పత్రిక సంపాదకులకు, అందమైన ఈ నెలవంక మా వంక వచ్చినందుకు చాలా సంతోషంగా ఉంది. దేవుళ్ళు ఎందరో అనుకుంటున్న మాలాంటి వాళ్లకు అల్లాహ్ ఒక్కడే దేవుడని, ఆరాధనలకు అర్హుడు ఆయన ఒక్కడే అని తెలియజేసిన ఐ.పి.సి వారికి నా ధన్యవాదాలు. 'సమగ్ర జీవితానికి సంపూర్ణ స్వరూపం' వ్యాసం చాలా బాగుంది. శ్రీ అజీజుర్రహ్మాన్ గారికి నా ధన్యవాదాలు. విశ్వాసుల మాత హజ్రత్ ఖదీజా (ర.అన్హా) గారి గురించి అబూ తఖ్‌హీమ్ వివరించిన రీతి మా మనస్సులను ఆకట్టుకుంది. చిన్న చిన్న వ్యాసాలతో చక్కని సాహిత్యంతో మా హృదయాలకు హత్తుకుపోయే విధంగా ఉంది ఈ మాస పత్రిక. ఒక మాటలో చెప్పాలంటే **నెలవంక** మా ప్రియ నేస్తం. ధర్మ సందేహాలు–సమాధానాలు అద్భుతం.

– సుమయ్యా (సుమలత)
జుబ్రా

కొత్త వెలుగుల నెలవంక

నెలవంక జులై సంచిక ఆకట్టుకునే ముఖ చిత్రంతో, సందేశాత్మకంగా ఆకర్షణీయంగా ఉంది. 'ధర్మసందేహాలు' శీర్షిక బదులుగా 'క్విజ్ శీర్షిక' ప్రారంభించినందుకు సంతోషం. కాకపోతే ధర్మ సందేహాలను కొనసాగిస్తూనే క్రొత్త శీర్షికను పొందుపరచి ఉంటే హుందాగా ఉండేది. మొత్తానికి 'క్విజ్ శీర్షిక' వల్ల ముహమ్మద్ (స) గారి చరిత్ర, ఖుర్‌ఆన్ లోతుల్లో ఉన్న పరమార్థం పండితుల పరిజ్ఞానానికి పదునుగాను సామాన్యుల మెదడుకు మేతగా ఉంటూ ధర్మజ్ఞానం వెల్లి విరిసేందుకు దోహదపడుతుంది. నెలనెలా కొత్త వెలుగులతో '**నెలవంక**' అలరారుతూ అందరి మన్ననలు పొందాలని అల్లాహ్‌ను ప్రార్థిస్తున్నాను.

– ముహమ్మద్ అమీన్
(ఫహాహీల్)

ధర్మ సందేహాలు తీరుస్తున్న పత్రిక

గౌరవనీయులైన **నెలవంక** మాస పత్రిక సంపాదక వర్గానికి మా హృదయపూర్వక కృతజ్ఞతలు. **నెలవంక** అద్భుతంగా ఉంది. తేనె లొలికే తెలుగులో వ్యాసంలోని ఒక్కో పలుకు మమ్మల్ని ఎంతో ఆకట్టుకుంటోంది. **నెలవంక** హృదయాలకు పట్టిన తుప్పును తొలగించి జ్యోతిర్మయం చేస్తోంది. నవ ముస్లిం సోదర సోదరీమణులు **నెలవంక** ద్వారా ధర్మ సందేహాలు తీర్చుకోగలుగుతున్నారు. **నెలవంక** ఎంత బావుందంటే ఒకసారి **నెలవంక** చదివినవారు రాబోయే మరో సంచిక కోసం ఎదురు చూపులే. ఈ నెలవంక నెలనెలా ఇలా కొనసాగాలని, షైతాన్ కీడు దీని మీద పడకూడదని పరమ పవిత్రుడైన అల్లాహ్‌కు దుఆ చేసి ముగిస్తున్నాను.

– సుగుణ (ఖదీజా) – జుబ్రా

'నేను మెచ్చిన ఇస్లాం' శీర్షిక అవసరం

ప్రధాన సంపాదకులకు

దాదాపు ప్రతి నెలలోని శీర్షికలు బాగానే ఉంటున్నాయి. కానీ జూన్ నెల **నెలవంక**లోని దృక్పథం, అదిగో అతడే విశ్వాసి, షేక్ వలీద్ ఉమ్రీ సేకరించిన ఆచార్య సంజయ్ ద్వివేది గారి ఇస్లాం స్వీకరణ చాలా బాగున్నాయి.

'నేను మెచ్చిన ఇస్లాం' అనే శీర్షికకు ప్రతి నెలవంకలోనూ చోటు కల్పించి అందులో ఒక నెల స్త్రీలకు, ఒక నెల పురుషులకు అవకాశం ఇస్తారని ఆశిస్తున్నాము.

– ముహమ్మద్, మర్యమ్ (రౌదా)

దైవ విధేయులుగానే బ్రతకండి

(10వ పేజి మిగతా భాగం)

మహాశయులారా!

ఇప్పటివరకూ పేర్కొనబడిన దివ్యవచనాలను కాస్త గమనించండి. అల్లాహ్ ఏ విషయాలను గురించి తాకీదు చేశాడో, ఏ విషయాల నుండి వారించాడో ఆలోచించండి – అల్లాహ్‌కు భయపడటం అంటే ఏమిటో మీకే తెలుస్తుంది.

పాపకార్యాలను, అత్యాచారాలను, అధర్మ సంపాదనను, నీతిబాహ్యతను, అన్యాయాన్ని, ఉగ్రవాదాన్ని విడనాడటమే అసలైన దైవభక్తి. అల్లాహ్‌కు కోపాన్ని తెప్పించే, ఆయన ఆగ్రహానికి గురిచేసే విషయాలకు దూరంగా ఉండని వారు అల్లాహ్ దృష్టిలో నిజమైన ముస్లిములు కారు.

అల్లాహ్ అనుగ్రహానికి పాత్రులూ, స్వర్గానికి అర్హులూ కావాలని కోరుకునే వారు కేవలం ఆరాధనలు, పుణ్యకార్యాలు చేస్తేనే సరిపోదు. పాప కార్యాలకు, అత్యాచారాలకు దూరంగా ఉండటం కూడా అవసరమే.

అల్లాహ్ పట్ల భయభక్తులు కలవారి జీవితాలు పరలోకంలోనే కాదు, ఇహలోకంలోనూ శుభదాయకమవుతాయి.

కారుణ్య ప్రభువైన అల్లాహ్ వారికి "ఫుర్‌ఖాన్" (మంచీ చెడుల విచక్షణా శక్తి)ని ప్రసాదిస్తాడు (8:36). వారి వ్యక్తిత్వం జనుల మధ్య రాళ్ళకుప్పలో మాణిక్యంలా ప్రస్ఫుటమవుతుంది. అల్లాహ్ వారి సంపాదనలో సమృద్ధిని ప్రసాదించి వారి జీవితావసరాలను తీరుస్తాడు. అప్పుల పీడన నుండి కాపాడుతాడు (65:2-3). మరణ ఘడియలో అలాంటి దైవభక్తుల ప్రాణాలు తీస్తూ దైవదూతలు, "మీకు శాంతి కలుగుగాక! మీ కర్మలకు ప్రతిఫలంగా స్వర్గంలో ప్రవేశించండి" అని అంటారు (16:32). ఎంత గొప్ప శుభవార్త!

నేడు స్వల్ప ప్రయోజనాల కోసం అల్లాహ్ ఆజ్ఞల్ని ఉల్లంఘించేవారు, అవిధేయతకు పాల్పడేవారు పశ్చాత్తాపపడుతూ "అయ్యో! మేము ముస్లిములము అయి ఉంటే ఎంత బాగుండేది" అని అంటారు (15:2). ఆ సమయం కూడా ఎంతో దూరంలో లేదు.

విశ్వాసులారా! ఆ దైన్య స్థితి రాకముందే, అల్లాహ్ ఆగ్రహానికి భయ పడండి. ముస్లిములుగానే జీవించండి. ముస్లిములుగానే మరణించండి.

మీరు గనక విద్యార్థులయితే...



ఎస్.ఎమ్.మలిక్
smmallick@hotmail.com

అవును, దివ్య ఖుర్‌ఆన్ పారాయణం చేశాము. స్వయంగా పారాయణం చెయ్యడమే కాక, హాఫిజ్‌లను నియమించి మరీ ఖుర్‌ఆన్ పఠనాన్ని వీనుల విందుగా విన్నాము. తరావీహ్ నమాజులో రోజూ దాదాపు గంట, గంటన్నరసేపు నిద్ర సుఖాన్ని నిష్కర్షగా త్రోసిపుచ్చి ఈ మహత్కార్యం కొరకే కేటాయించాము. రమజాన్ నెల సాంతం, సమయం దొరికినప్పుడల్లా పరమ పవిత్రమయిన ఆ ఉద్గ్రంథ పఠనం చేశాము.

సకల లోకాలకు ప్రభువయిన అల్లాహ్ తన దాసులయిన మానవుల కోసం, తన ప్రేమకు ప్రతీకగా, తన ప్రీతిపథానికి ప్రమిదగా, మానవ హృదయ నిశీథికి ప్రత్యూషగా, మానవాంతర్య రుగ్మత నివారిణిగా, దివి నుండి దింపిన దివ్య ఔషధి అది. ఆ పరమ దివ్య గ్రంథాన్ని మధుర మకరంద ధారలు జాలువారు తుండగా దివ్యంగా శ్రావ్యంగా గానం చేశాము. ఆ గ్రంథరాజాన్ని కాంతులు వెదజల్లే కళావైభవం తొణికిసలాడగా బంగరు సిరాతో వ్రాయించాము. ఆ మహాగ్రంథ పత్రాలను ప్రాణ ప్రదంగా, పవిత్రంగా, భక్తిప్రపత్తులతో తలపైన మోశాము, కళ్ళ కద్దుకున్నాము, భద్రపరిచాము. దాని ఎడల గౌరవభావాన్ని, భయభక్తుల్ని, ప్రేమాదరణల్ని ఎన్ని విధాల వ్యక్తం చెయ్యాలో అన్ని విధాలా ప్రదర్శించాము. ఇంకేం చెయ్యాలి?

నిజమే, ఇదంతా చెయ్యవలసిందే. కాని మీరు విద్యార్థులయితే....

మీ పాఠ్యపుస్తకాలను ఇలాగే అర్థం చేసుకోకుండా 'పారాయణం' చేస్తారా? మీరు కొనే దిన, వార, మాసపత్రికల్ని ఇలాగే ' అనుసంధానం ' చేసి భద్ర పరుస్తారా? మీకు మీ కార్యాలయాల నుండి అందే ఆదేశ పత్రాలను సువర్ణాక్షరాలతో వ్రాయించి మీ కుడ్యాలంకరణ కొరకు వినియోగించుకుంటారా? న్యాయస్థానం మీకు దండన విధిస్తూ తీర్పు ఇస్తున్నప్పుడు 'ఆ మహా న్యాయమూర్తి కంఠం ఎంత కర్ణపేయంగా ఉంది! ఎన్ని సంగీత సౌరభాలు విరజిమ్ముతోంది!!' అని సంభ్రమాశ్చర్యాల్లో మునిగితేలుతారా? మీరే చెప్పండి, ఖుర్‌ఆన్ పట్ల మీ వైఖరిని ఎలా అభివర్ణించాలో!?

దివ్య ఖుర్‌ఆన్ మీ స్వామి పంపిన సందేశం; మార్గదర్శక గ్రంథం; జీవన నియమావళి; అంక్షలూ అనుమతులున్న ప్రవర్తనా నిబంధనావళి; ఆర్థిక సూత్రావళి; శిక్షాస్మృతి; శాసన గ్రంథం; రాజ్యాంగ పత్రం. గుడ్డిగా పారాయణం చెయ్యడానికి బట్టీయం వెయ్యడానికీ కాదు. నేత్ర కవాటాలను తెరచి, మనోచేతనను జాగృతం చేసి మీరు అర్థం చేసుకోవడానికి, ఆలోచించడానికి అరుదెంచిన ఫర్మానా అది. ఇహంలోనూ, పరంలోనూ మీ మార్గం సుగమం చెయ్యడమే దాని పరమార్థం. మీరు ఆలోచించడానికి, అనుసరించడానికి సిద్ధంగా లేరా?

"వీరు ఖుర్‌ఆన్‌పట్ల చింతన చెయ్యలేదా, లేక వీరి హృదయాలపై తాళాలు పడి ఉన్నాయా?" (47:24)

అంతేగా మరి. ఇలాంటి మహత్తర జ్ఞాన నిధి ద్వారా ప్రాప్తమైన సూచనలను గురించి లోతుగా ఆలోచన, అనుశీలన జరపకపోతే హృదయాలకు తాళాలు పడినట్లే కదా అర్థం!

'మీ ఇంటి గదుల్లో అనేక స్విచ్చులున్నట్లే మీ మనోమందిరానికి ఎన్నో మీటలున్నాయి. దివ్య గ్రంథం కర్ణపేయంగా విని, నేత్రానందంగా కని సంబరపడే స్విచ్‌ని కాదు, భయభక్తులతో విధేయతకు, ఆజ్ఞాపాలనకు సమాయత్తపరిచే మీటను నొక్కండి – జీవితాశయం సిద్ధిస్తుంది".

('వెన్నెల తెరలు' సౌజన్యంతో)

దృక్పథం



మరువ బోకుమా !

ప్రియమైన తెలుగు పాఠకులకు,

ఆంధ్ర ప్రదేశ్ అవతరణ దిన శుభాకాంక్షలు!

ఈ సంచిక మీ చేతికి అందేనాటికి రాష్ట్రావతరణ దినోత్సవాలు జరిగిపోయి ఉంటాయి. భాషా ప్రాతిపదికపై రాష్ట్రాల పునర్నిర్మాణం (1956) జరిగినప్పుడు తెలుగు మాట్లాడే ప్రాంతాలన్నింటినీ కలిపి సంపూర్ణ ఆంధ్ర ప్రదేశ్‌కు తుది రూపమివ్వటం జరిగింది. అంటే, మన రాష్ట్రావిర్భావానికి దోహదపడిన ఏకైక కీలకాంశం 'తెలుగు భాష' అన్న సంగతి మరువరానిది.

"దేశ భాషలందు తెలుగు లెస్స" అని రాయల వారిచే కొనియాడబడిన భాష తెలుగుభాష! "ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్" గా మేధావులచే మన్ననలందుకున్న భాష మన తెలుగు భాష! ఈ భాషలో రామాయణం, మహాభారతం, బైబిల్, ఖుర్‌ఆన్ వంటి ఉద్గ్రంథాలతో కూడిన ఆధ్యాత్మిక సాహితీ సంపద పుష్కలంగా ఉంది. అఖిల భారత స్థాయిలో జ్ఞానపీఠ్ ఆవార్డును అందుకున్న అత్యుత్తమ శ్రేణి కవులు తెలుగునాట పుట్టారు. వివిధ ఉద్యమాలకు ఊపిరిపోసిన సైద్ధాంతిక, విప్లవ కవులు తెలుగు గడ్డపై ప్రభవించారు. వితంతు వివాహాలను ప్రోత్సహించి; అంటరానితనం, నిమ్నోన్నతా భేదభావాలను తెలుగు మాధ్యమంతో చీల్చి చెండాడిన సంస్కర్తలు, 'యొక్క' లతో భాషకు బొక్కలు కొట్టకండని శాసిస్తూ తెలుగులో జర్నలిజానికి సరికొత్త ఒరవడిని ఇచ్చిన అగ్రశ్రేణి పాత్రికేయులూ మనకున్నారు. దురాచారాలపై, మూఢ నమ్మకాలపై తిరుగుబాటు బావుటాను ఎగురవేసిన సాహితీ పరులు కూడా తెలుగు గడ్డపై ఉద్భవించారు.

జీవితపు వివిధ రంగాలను శాసించే స్థాయికి ఎదిగిన ఈ తెలుగు సాహితీ వేత్తలంతా ఒకే బాటపై నడచి ఉండకపోవచ్చు. వారి బాణి వేరుకావచ్చు. వారి భావాలలో సారూప్యం ఉండకపోవచ్చు. ఆ మాటకొస్తే అనేక మతాలకు, సిద్ధాంతాలకు సంగమమైన ప్రదేశంలో సాహితీపరుల మధ్య భావసారూప్యం సాధ్యం కాదు కూడా.

ఒకరి అభిమతం ఇంకొకరికి రుచించకపోవచ్చు. ఒకరి వాదనతో ఇంకొకరు ఏకీభవించకపోవచ్చు. అలాగే ఒకరి అభిప్రాయం ఇంకొకరికి నచ్చకపోవచ్చు. అయినప్పటికిన్నీ మనం వాటన్నింటినీ అకామడేట్ చేయటం, ఆదరించటం నేర్చుకోవాలి. నీతి బాహ్యతకు, అశ్లీలానికి అమడదూరాన ఉంటూ తెలుగు జన బాహుళ్యానికి దృక్పథంతో కూడుకున్న సాహిత్యాన్ని అందించిన వారంతా సదా ఆదరణీయులే. ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవ సందర్భంగా నవతరం ఈ తెలుగు మహానుభావులను మరువరాదు.

ఒక చూపులో !

– అబూ అతీఖ్

కమీషన్‌ను నియమించింది. ఇటు ఆమరణ నిరాహార దీక్షబూనిన పొట్టి శ్రీరాములు అసువులు బాసారు. దీంతో ఉద్యమం తీవ్ర రూపం దాల్చింది. ఎట్టకేలకు కేంద్ర ప్రభుత్వం భాషా ప్రాతిపదికపై రాష్ట్రాల పునర్నిర్మాణానికి పచ్చజెండా ఊపింది. 1956 నవంబరు 1వ తేదీన ఆంధ్ర రాష్ట్రం కాస్తా సంపూర్ణ ఆంధ్రప్రదేశ్‌గా అవతరించింది. రాజధానిని కర్నూలు నుండి హైదరాబాదుకు మార్చారు. శ్రీ నీలం సంజీవ రెడ్డి ఆంధ్రప్రదేశ్ తొలి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించారు.

వేర్పాటు వాద ధోరణులు


కాని అప్పటికే తెలంగాణా ప్రాంతంలోని కొన్ని వర్గాలకు సమైక్య ఆంధ్రలో విలీనమవటం ఇష్టం లేదు. పరిస్థితుల ప్రభావానికి వారు తాత్కాలికంగా తల ఒగ్గినప్పటికీ, అసంతృప్తి మాత్రం లోలోపల రాజుకుంటూనే ఉంది. ఒక దశాబ్ది కాలం గడిచేసరికే అది శృతి మించి రాగాన పడింది. డా. మర్రి చెన్నారెడ్డి నేతృత్వంలో తెలం'గానం' మొదలయ్యింది. శ్రీ కాసు బ్రహ్మానంద రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో పెల్లుబికిన ఈ ఆందోళనకు రాజధాని నగరంలో నివసించే ఆంధ్ర ప్రాంతాలవారు బిక్కు బిక్కు మంటూ గడపవలసి వచ్చింది. ఆ రోజుల్లోనే కేంద్రం ఎదుర్కొన్న కొన్ని అసాధారణ పరిస్థితుల వల్ల తెలంగాణా ఉద్యమం శాంతించింది.

జై ఆంధ్ర !

ఈ లోగా (1972లో) ఆంధ్ర ప్రాంతపు మేధావులు, రాజకీయ నాయకులు తీవ్రంగా తర్జన భర్జన చేసుకుని 'జై ఆంధ్ర మూవ్‌మెంట్' నినాదం ఇచ్చారు. ఈ వేర్పాటు నినాదం ఆనాటి ప్రధానమంత్రి ఇందిరమ్మకు సుతారమూ ఇష్టంలేదు. 56 రోజులపాటు విద్యాలయాలు మూత పడ్డాయి. ధర్నాలు, రాస్తారోకోలతో ప్రజా జీవితం స్థంభించింది. కాని 'అమ్మ' పలకలేదు. భారీ ఎత్తున సి.ఆర్.పి దళాలను మోహరించి మూవ్‌మెంట్‌ను నిర్దాక్షిణ్యంగా అణచివేశారు. ఆనాడు కమ్యూనిస్టు పార్టీలు సమైక్య ఆంధ్ర రాగాన్ని ఆలాపించటం గమనార్హ విషయం.

కాంగ్రెసుకు కంచుకోట

రాజకీయంగా చూస్తే ఆంధ్రులు 1953 నుంచి కూడా కాంగ్రెస్ పార్టీకే అండగా నిలిచారు. వేర్పాటు ఉద్యమాల ప్రభావం రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంపై అంతగా పడలేదు. ఇందిరాగాంధీ ఎన్నికపై అలహాబాద్ హైకోర్టు తీర్పు నేపథ్యంలో కేంద్ర రాజకీయాలు వేడెక్కాయి. లోక్ నాయక్ 'జయప్రకాశ్ నారాయణ్ నేతృత్వంలో 'సంపూర్ణ విప్లవం' గుజరాత్ నుండి మొదలై ఉత్తరాది రాష్ట్రాలను ఊపివేసింది. 1975 జూన్‌లో అత్యవసర పరిస్థితి (ఎమర్జన్సీ) విధించబడింది. 1977 మార్చిలో తిరిగి సార్వత్రిక ఎన్నికలు జరిగినప్పుడు ప్రతిపక్షాలన్నీ ఒక గొడుగు క్రిందికి వచ్చి 'జనతాపార్టీ' ని స్థాపించాయి. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన 30 ఏండ్ల తరువాత మొట్టమొదటి సారిగా ఒక



అర్ధ శతాబ్ది ఆంధ్రప్రదేశ్ -

'అన్నపూర్ణ' గా ప్రసిద్ధి చెందిన తెలుగు నేల... బహుళార్ధక సాధక ప్రాజెక్టులతో నదీ జలాలను పరవళ్లు తొక్కిస్తున్న జీవధాత్రి....అపురూపమైన చారిత్రక కట్టడాలతో గత వైభవానికి సాక్షీభూతంగా నిలిచిన రాజధాని నగరం...అపారమైన ఖనిజ నిక్షేపాలతో గాంభీర్యం ప్రదర్శించే దక్కను ఫీఠభూమి... రమారమి వెయ్యి కిలోమీటర్ల దూరం వరకూ సముద్రాన్ని తాకే కోస్తా ప్రాంతం... అలనాడు రతనాల సీమగా అలరారిన నేటి రాయలసీమ... ఈనాడు బహుళ జాతి సంస్థలకు శ్రీనిలయంగా ఆకర్షిస్తున్న తెలుగు గడ్డ... అదే అన్నీ కలసిన తెలుగునాడు... 23 జిల్లాల సువిశాల ఆంధ్రప్రదేశ్ ! స్వర్ణాంధ్రప్రదేశ్ !! హరి తాంధ్రప్రదేశ్ !!! సంపూర్ణ రాష్ట్రావతరణ జరిగి 51 ఏండ్లు నిండిన శుభ సందర్భంగా కువైట్‌లోని ప్రవాసాంధ్రులకు ప్రత్యేకంగా **నెలవంక** అందిస్తున్న వ్యాసమిది -

పుట్టు పూర్వోత్తరాలు

"అయ్యవారికి చాలు అయిదు వరహాలు. పిల్ల వారికి చాలు పప్పు బెల్లాలు" అన్నట్లు రాష్ట్రావతరణ దినోత్సవ సందర్భంగా త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి, బడి పిల్లలకు చాక్లెట్లు పంచిపెట్టి చేతులు దులుపుకుంటున్నామే గాని, అసలీ ఆంధ్ర రాష్ట్రావతరణ ఎలా జరిగింది? మన పూర్వీకులు ఏం ఆశించి దీని కోసం పోరాడారన్న విషయాన్ని గురించి మనం బొత్తిగా పట్టించుకున్నట్టు కనిపించదు.

అరవై ఏళ్ల క్రితం భారతదేశానికి స్వాతంత్ర్యం సిద్ధించినపుడు దేశ అంతర్ముఖం విచిత్రంగా వుంది. స్వతంత్రంగా ఉన్న వందలాది సంస్థానాలను ఇండియన్ యూనియన్‌లో విలీనం చేస్తున్న రోజులవి. ఆనాడు హైదరాబాదు సయితం ఒక స్వతంత్ర సంస్థానంగా ఉండేది. తెలుగు వారి కంటూ ఆనాడు ప్రత్యేక రాష్ట్రం ఏదీ లేదు. ఇప్పటి రాయలసీమ, కోస్తాంధ్ర జిల్లాలన్నీ అప్పట్లో మద్రాసు రాష్ట్రంలో అంతర్భాగంగా ఉండేవి. అంగట్లో అన్నీ వున్నా అల్లుడి నోట్లో శని అన్నట్లు, ఒక రాష్ట్రంగా ఏర్పడటానికి కావలసిన అన్ని అర్హతలూ ఉన్నప్పటికీ ఆంధ్రరాష్ట్రం గురించి ఆలోచించే తీరిక మన వాళ్లకు లేకపోయింది. బహుశా దేశ స్వాతంత్ర్యం ఒక్కటే వారి ప్రాధమ్యాల్లో ఉండి ఉంటుంది. అయితే 1947 తరువాత ఆంధ్ర రాజకీయ ప్రముఖులంతా ఒక్కసారిగా ఆలోచనలో పడిపోయారు.

మద్రాసు రాష్ట్రంలో తమిళ ప్రాబల్యం కోసం 'ద్రవిడ మున్నేట్ర కజగం' విజృంభించిన తీరును తిలకించిన తెలుగు జాతికి దిమ్మ తిరిగినంత పని యింది. తెలుగు మాట్లాడే వారి ప్రాంతాలన్నింటినీ మద్రాసు రాష్ట్రం నుండి విడదీసి తమకు ప్రత్యేక రాష్ట్రం ఇవ్వాలని ఆంధ్ర నాయకులు సహజంగానే కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చారు. కేంద్ర ప్రభుత్వం కూడా పాజిటివ్‌గానే స్పందించింది. ఆనాటి భారత ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ, హోం మంత్రి వల్లభ భాయ్ పటేల్, డా. పట్టాభి సీతారామయ్యలతో కూడిన ఒక విచారణ కమిటీని నియమించింది. త్వరలోనే జె. వి. పి. రిపోర్టు కేంద్రానికి సమర్పించబడింది. మొత్తానికి 1953 అక్టోబరు ఒకటవ తేదీన కర్నూలు రాజధానిగా ఆంధ్ర రాష్ట్రం ఒకటి ఏర్పరచబడింది. కాని ఈ ఏర్పాటు పాక్షికమైనదే.

భాషా ప్రయుక్త రాష్ట్రాలు


స్వాతంత్ర్య సమరయోధుడు శ్రీ టంగుటూరి ప్రకాశం పంతులు ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా ఎంపికయ్యారు. అయితే అప్పటికి తెలంగాణా ప్రాంతం ఆంధ్ర రాష్ట్రంలోకి ఇంకా రాలేదు. ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటుతో భారత దేశంలో భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు వాదనకు గట్టి సమర్ధన లభించింది. హైదరాబాదు సంస్థానంలో అంతర్భాగంగా ఉన్న తెలుగు ప్రాంతాలను (తెలంగాణాను) కూడా ఆంధ్ర రాష్ట్రంలో కలిపి సంపూర్ణ ఆంధ్రప్రదేశ్ ఇవ్వాలని తెలుగువారు పట్టుబట్టారు. పొట్టి శ్రీరాములు ఆమరణ నిరాహార దీక్షకు పూనుకున్నారు. హర్యానా, గుజరాత్ ప్రాంతాల్లో సయితం భాషా ప్రయుక్త రాష్ట్రాల ఉద్యమాలు ఊపందుకున్నాయి. పర్యవసానంగా కేంద్ర ప్రభుత్వం ఫజుల్ అలీ



ఇస్లాము - కత్తిబలంతో వ్యాపించిందా?

తమిళ మూలం
అడియార్

తెలుగు రూపం
శ్రీమతి మాలతీ చందూర్



కత్తి ఝళిపించటం చేత ఇస్లామ్ మార్గం వ్యాపించింది - అన్న తప్పుడు అభిప్రాయం కొందరు కలిగివున్నారు.

క్రీస్తు మతము, ఇస్లామూ ఈ రెండూ ఆరంభంలో - రహస్య మార్గాలు గానే ఉన్నవి - అని స్థూలంగా చరిత్ర చెపుతున్న విషయం.

అందులోనూ క్రీస్తు మత ప్రబోధనలు, ఏసుక్రీస్తు మరణించిన తరువాత ఆయన శిష్యుల చేత ప్రచారం చేయబడి, వ్యాపించాయి.

కాని ఇస్లామ్ - మొదట్లో రహస్యమైన ప్రబోధమార్గమయివుండి, తరువాత బహిరంగపరచే అధికారము పొంది, బయట ప్రపంచానికి తెలియపరచబడినది.

నిర్బంధము లేక బల ప్రయోగము - వీటిని ఇస్లామ్ ఎంతమాత్రమూ ఒప్పుకోదు అని ఖ్యాతి వహించింది.

అటువంటప్పుడు, మహాప్రవక్త కత్తిదూసి పోరాటాలు జరపడం ఎలా సంభవించింది?

ఆ యుద్ధాలన్నీ స్వీయ రక్షణ కోసం చేయబడిన యుద్ధాలే.

మక్కాలోని ఖురైషి తెగవారు, మహాప్రవక్తకి ఆశ్రయం ఇచ్చిన మదీనా ప్రజలపై దాడి జరిపినపుడు, కొత్త మార్గాన్ని స్వీకరించిన మదీనా వాసులని అణగదొక్కాలన్న ప్రయత్నం జరిగినపుడు, పోరాటాలకి అంకురార్పణ జరిగింది.

అందుచేత, స్వీయరక్షణ కొరకు, తన మార్గాన్ని అనుసరించిన ప్రజా రక్షణ కొరకు ఖడ్గం ఎత్తబడిందే తప్ప మత విస్తరణ కోసం మటుకు కాదు.

ఆ తరువాత కాలంలో ముస్లిమ్ చక్రవర్తులు తమ సైన్యంతో ఇతర దేశాలపై దండయాత్రలు జరిపిన సంఘటనలు లేకపోలేదు. ఆ దండయాత్రలు కూడా 'ఇస్లామ్ మార్గ విస్తరణ కొరకు' అన్న లక్ష్యంతో ఆరంభించబడలేదు.

భారతీయ చక్రవర్తులయిన రాజరాజు, రాజేంద్రుడూ మొదలగువారు జావా, సుమిత్రా ఇంకా దిగువ భాగాన ఉన్న దేశాలపై దండయాత్రలు సలిపారు.

ఇప్పటికీ ఆ దేశాలలో హిందూ మత చిహ్నాలు కనిపిస్తూనే ఉన్నాయి. ఆ కారణంచేత హిందూ మత విస్తరణ కోసం ఆ చక్రవర్తులు కత్తి పట్టుకున్నారని అనటానికి వీలవుతుందా?

క్రీస్తు మతస్తులయిన, యూరోపియనులు ఎన్నో యుద్ధాలు జరిపారు. సామ్రాజ్యాలు స్థాపించారు. ఆ సామ్రాజ్యంలో క్రీస్తు మతస్థులే ఎక్కువ సంఖ్యలో ఉండేవారు.

అట్లాంటప్పుడు క్రీస్తు మతం కత్తి బలంతో విస్తరణ చేసిన మతం అవదా?

అసలు ఇందులోని సత్యం ఏమిటంటే ఇంకో దేశాన్ని చేజిక్కించుకోటానికి, ఆ దేశంలో తమ అధికారాన్ని నెలకొల్పటానికి దండయాత్రలు జరుగుతూ ఉంటాయి.

'యథా రాజా - తథా ప్రజా' అన్నట్లు పాలకులు ఏ మతానికి చెందిన వారై ఉంటారో - ఆ వైపునకే ప్రజలు మొగ్గు చూపటం సహజం.

ఇదే దక్షిణ భారతంలో జైన మతావలంబకులైన రాజులు పరిపాలించినపుడు జైనుల సంఖ్య పెరుగుతూ వచ్చింది? చక్రవర్తులు బౌద్ధ మతస్థులయినపుడు బౌద్ధ మతం తామరతంపరగా పాతుకుపోయింది. రాజులు శైవులుగా మారినపుడు శైవుల సంఖ్య అధికమయింది. ఆ తరువాత వైష్ణవులుగా మారినపుడు వైష్ణవుల సంఖ్య మిక్కుటంగా పెరగగల అవకాశం ఏర్పడింది.

తమ మార్గాన్ని అనుసరించలేదన్న ఆ ఒక్క కారణం కోసం, ఇస్లామ్ మత పరమైన హత్యలను ఏనాడూ సమర్థించలేదు.

కాని, కేథలిక్కులకీ, ప్రొటెస్టెంటులకీ మధ్య నడిచిన పోరాటంలో మత పరమైన హత్యలు జరిగినవి.

అంతదాకా ఎందుకు? మధురైలో కూడా జ్ఞాన సంబంధర్ కాలంలో ఎనిమిది వేల మంది జైనులు గ్రద్దలకి ఆహారమయ్యారని చరిత్ర చెబుతున్నది.

అరేబియా దేశానికి మహాప్రవక్త పాలకుడై పరిపాలించిన కాలంలో - ఆ దేశంలో యూద మతస్థులు ఉన్నారు. క్రీస్తు మతస్థులు కూడా ఉన్నారు.

ఏం..... భారతదేశంలో కూడా ముస్లిమ్ నవాబులు పరిపాలించిన కాలంలో హిందూ మతమూ, హిందూ దేవాలయములు మున్నగునవి పరిరక్షింపబడినవని చరిత్ర చెపుతున్నది.


మత విస్తరణ కొరకే - ముస్లిమ్‌లు దండ యాత్రలు జరిపారు అంటే..


పర రాజ్యాన్ని ఆక్రమించుకోవటం ఆ కాలంలోని రాజధర్మం, రాచరిక వ్యవస్థలో రాజ్య విస్తీరణే పరాక్రమ చిహ్నం. ఆ ప్రకారం దండయాత్రలు జరిపేవారు తప్ప, మతాన్ని విస్తృతపరిచే ఉద్దేశ్యంతో మటుకు కాదు.

హిందూ చక్రవర్తులతో సంబంధం లేకుండానే, కొందరు ముస్లిమ్ మత ప్రచారకులు - భారతదేశంలో ఈ మార్గాన్ని విస్తృతపరిచివున్నారు. ఉదాహరణగా చెప్పాలంటే - నాగూర్‌లో సమాధి చేయబడివున్న అత్యున్నత వ్యక్తి- 'షాహుల్ హమీద్' ని చెప్పుకోవచ్చు.

ఉపదేశాల వల్ల, జీవన విధానం వల్ల మానవుని మనసులో ఆర్ద్రత కలిగించగల శక్తివున్న ఇస్లామ్‌కి కత్తి పట్టుకోవలసిన అవసరం లేదు. చరిత్ర పట్ల సరిఅయిన అవగాహనలేని వ్యక్తులు అనేటువంటి అర్థవిహీనమయిన మాటలని మనం పట్టించుకోనక్కరలేదు.

("నేను ఆరాధించే ఇస్లాం" పుస్తకం నుండి)





కాంగ్రెసేతర పార్టీ కేంద్రంలో అధికారంలోకి వచ్చింది. ఎమర్జన్సీ దెబ్బకు ఉత్తరాది రాష్ట్రాల్లో కాంగ్రెస్ తుడిచిపెట్టుకుపోయినప్పటికీ ఆంధ్ర ప్రదేశ్ మాత్రం కాంగ్రెస్‌కు కంచుకోటగా నిలిచింది. మొత్తం 42 లోక్‌సభ నియోజక వర్గాలకుగాను (ఒక్క నంద్యాల నియోజక వర్గం తప్ప) 41 నియోజక వర్గాలలో తెలుగు ప్రజలు కాంగ్రెస్‌కు బ్రహ్మరథం పట్టారు. అదీ విచిత్రం, విశేషం!

'హస్తిన' లో అధికారం కోల్పోయిన ఇందిరమ్మకు 1978లో కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలకు జరిగిన ఎన్నికలు కలసొచ్చిన అదృష్టంగా పరిణమించాయి. ఆ సందర్భంగా ఆమె కాసు బ్రహ్మానందరెడ్డిని కాంగ్రెస్ అధ్యక్ష పదవి నుంచి తప్పించి పార్టీ పగ్గాలు తన చేతిలో తీసుకోవాలనుకున్నారు. కానీ రెడ్డిగారు ససేమిరా అన్నారు. చవాన్, వెంగళరావులు సయితం రెడ్డి గార్కి అండగా నిలబడ్డారు. అమ్మగారికి కోపం వచ్చింది. ఆఫమేఘాల మీద అబ్దుర్రహ్మాన్ అంతూలే, దేవరాజ్ అర్స్, డా. చెన్నారెడ్డి, పి.వి.నరసింహా రావులను పిలిపించి పార్టీని రెండోసారి చీల్చారు. ఫలితంగా ఇందిరా కాంగ్రెస్ ఆవిర్భవించింది. 'హస్తం' గుర్తు ఆ పార్టీకివ్వబడింది. ఇందిరమ్మ ఖద్దరు చీరకట్టుకుని హెలికాప్టర్‌లో సుడిగాలిలా తిరిగారు. మరోసారి సాను భూతి వెల్లువ పెల్లుబికింది. తిరుగులేని మెజారిటీ (175 స్థానాల)తో ఐ. కాంగ్రెస్ గెలిచింది. ముఖ్యమంత్రి కావాలన్న మర్రి చెన్నారెడ్డి స్వప్నం సాకారమయింది.

అమ్మంటే మాటలా !

1978 నుంచి ఆంధ్రప్రదేశ్ రాజకీయ చిత్రపటంలో అనూహ్యమయిన మార్పులు వచ్చాయి. తానేం చేసినా ఆంధ్రప్రదేశ్‌లో చెల్లుతుందన్న నమ్మకం ఇందిరమ్మ మదిలో గట్టిగా నాటుకుంది. రాష్ట్ర శాసన సభ్యుల మనోగతంతో నిమిత్తం లేకుండా ఢిల్లీ నుంచి ముఖ్యమంత్రులను ఇంపోర్టు చేసుకునే సంస్కృతి కాంగ్రెకి బాగా ఒంటబట్టింది. తత్ఫలితంగా ఐదేండ్ల కాలంలో నలుగురు ముఖ్యమంత్రులు (డా. చెన్నారెడ్డి, శ్రీ టి. అంజయ్య, శ్రీ భవనం వెంకట్రామ్‌రెడ్డి, శ్రీ కోట్ల విజయభాస్కరరావు) మారారు. **"ఆరణాల కూలివాణ్ణి. అమ్మ నన్నింతటివాణ్ణి చేసింది"** అని అప్పట్లో ముఖ్యమంత్రి అంజయ్య గారు రోజుకొక్కసారైనా చెప్పుకుని ఇందిరమ్మగారికి కృతజ్ఞతలు తెలుపుకునేవారు.

తెలుగు దేశం' ఆవిర్భావం - కొత్త మలుపు

ఈ పరిణామాలు సహజంగానే తెలుగు ఓటరును ఆలోచనలో పడవేశాయి. కానీ అప్పటివరకూ దీటైన 'ప్రత్యామ్నాయం' లేదాయె. 1982 మార్చిలో ఆ ప్రత్యామ్నాయ శక్తి ముందుకు వచ్చింది. ఆంధ్రుల అభిమాన నటుడు శ్రీ నందమూరి తారక రామారావు "తెలుగు దేశం" పార్టీని స్థాపించి యావత్తు రాష్ట్రం చుట్టి వచ్చారు.

"ఆరు కోట్ల ఆంధ్రుల ఆత్మాభిమానాన్ని ఢిల్లీలో తాకట్టు పెడతారా బ్రదర్?" అని గర్జించారు. ఈ గర్జనకు ప్రజల నుంచి అనూహ్యమైన స్పందనే లభించింది. 1982 డిశంబరులో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో తొలిసారిగా కాంగ్రె ఘోర పరాజయం చవిచూసింది. 200 స్థానాలు గెలుచుకుని కేవలం 9 మాసాలలో అధికారం చేజిక్కించుకున్న పార్టీగా తెలుగుదేశం చరిత్ర సృష్టించింది. మేనకాగాంధీ స్థాపించిన 'సంజయ్ విచార్ మంచ్'కు సయితం తెలుగుదేశం అండతో రాష్ట్రంలో 4 సీట్లు బోనస్‌గా లభించాయంటే అప్పటి 'అన్న' ప్రభంజనం ఎంత బలమైనదో ఊహించవచ్చు.

తెన్నుపోటు

ఏడాదిన్నర కాలం టి.డి.పి. పాలన సజావుగానే సాగింది. 1984 ఆగస్టులో ముఖ్యమంత్రి ఎన్.టి.ఆర్ - నాదెండ్ల భాస్కరరావుల మధ్య విభేదాలు రచ్చకెక్కాయి. ఫలితంగా తెలుగుదేశం నిలువునా చీలిపోయింది. నాదెండ్ల 60 మంది ఎం.ఎల్.ఏలతో బయటికి వచ్చి 'ప్రజాస్వామ్య తెలుగుదేశం' పార్టీ స్థాపించారు. కాంగ్రెస్ శాసన సభ్యుల మద్దతుతో, గవర్నర్ రామ్‌లాల్ అందదండలతో అందలం ఎక్కారు నడ మంత్రపు నాదెండ్ల. కాని నాదెండ్లకు వాస్తవంగా మెజారిటీ లేదు. బేరసారాలు, క్రయ విక్రయాలతో హైదరాబాదు రాజకీయాలు వేడెక్కినాయి.ఈలోగా ఎన్.టి.ఆర్ తన వెంటవున్న 135 మంది ఎం.ఎల్.ఏలతో బస్సులో సరాసరి ఢిల్లీకే వెళ్ళి రాష్ట్రపతిభవన్ వద్ద బైఠాయించారు. బి.జె.పి, కమ్యూనిస్టుపార్టీలు కూడా ఎన్.టి.ఆర్ వెంట వచ్చాయి. ఈ నాటకీయ పరిణామాలు కాంగ్రెస్ ప్రతిష్ఠను బాగా దెబ్బతీశాయి. అమ్మగారు ఓ మెట్టు దిగివచ్చారు. ఆంధ్ర ప్రదేశ్ గవర్నర్ రామ్‌లాల్‌ను వెనక్కి పిలిపించి డా. శంకర్ దయాళ్ శర్మను రాష్ట్ర గవర్నర్‌గా నియమించటం, శర్మగారు ఎన్.టి.ఆర్‌ను తిరిగి ముఖ్యమంత్రిగా నియమించటం యుద్ధప్రాతిపదికపై జరిగిపోయాయి.

అంతలోనే.....

1984 అక్టోబర్ 30వ తేదీ - మూర్తీభవించిన సాహసం మూగవోయింది. భారత ప్రధాని శ్రీమతి ఇందిరా గాంధీ దారుణంగా హత్య చేయబడ్డారు. ఈ పరిణామానికి దేశమంతా వణికిపోయింది. రాజీవ్ గాంధీ ప్రధాన మంత్రిగా ప్రమాణ స్వీకారం చేయగానే 1984 ఎండింగ్‌లో పార్లమెంటుకు మధ్యాంతర ఎన్నికలు ప్రకటించారు. ఎప్పుడూ లేనంత ఘన విజయం కాంగ్రె సాధించింది. బి.జె.పి లాంటి జాతీయ పార్టీ లోక్‌సభలో రెండే రెండు సీట్లతో సరిపెట్టు కోవాల్సి వచ్చిందంటే, అప్పటి కాంగ్రెస్ సానుభూతి వెల్లువను అంచనా వేయవచ్చు. అయితే అటువంటి కీలక సమయంలో కూడా

(మిగతా భాగం 14వ పేజీలో)

మహిళావని



విశ్వాసుల మాత

హజ్రత్ జైనబ్ బిన్తె జహాష్ (ర.అన్హా)



– అబూ తఫ్హీమ్
ipctelugu@rediffmail.com

హజ్రత్ జైనబ్ బిన్తె జహష్ (ర.అన్హా) ఖురైష్ వంశంలో పుట్టిన మహిళ. ఈమె తల్లి పేరు అమీమ. అమీమ ఎవరో కాదు, అబ్దుల్ ముత్తలిబ్ తోబుట్టువే. ఆ విధంగా హజ్రత్ జైనబ్ (ర.అన్హా) కు దైవ ప్రవక్త (స) తో బంధుత్వం కూడా ఉంది. ఈమె దైవప్రవక్త (స) కు మేనత్త కూతురవుతారు. ముహమ్మద్ (స) కు దైవదౌత్యం అందిన తొలి కాలంలోనే ఈమె ఇస్లాం స్వీకరించారు.

అదలావుంటే హజ్రత్ జైద్ బిన్ హారిస దైవ ప్రవక్త(స)చే స్వేచ్ఛనొసగబడిన బానిస. దానికి తోడు జైద్ దైవ ప్రవక్త (స) దత్తపుత్రుడు కూడా. దైవప్రవక్త (స) జైనబ్ వివాహాన్ని తన దత్తపుత్రుడైన జైద్‌తో జరిపించి, ఇస్లాంలో సమానత్వానికి సంబంధించిన గొప్ప ఆదర్శాన్ని నెలకొల్పారు. ఇస్లాంలో గౌరవాదరణలకు ప్రమాణం ధర్మ నిష్ఠేగాని కుల గోత్రాలు కావు. హజ్రత్ జైద్ ఒకప్పుడు నల్లని నీగ్రో బానిసే అయినప్పటికీ ఆయన ఒక నిజ ముస్లిం. సిసలైన దైవభక్తిపరుడు. అందువల్ల ఇస్లామీయ దృక్పథం ప్రకారం ఈయన మరే యితర స్వతంత్ర ముస్లిం కన్నా తక్కువ కాదు.

పెండ్లి జరగటానికైతే జరిగింది. కాని ఈ దంపతుల మధ్య ప్రేమానురాగాలు మాత్రం చిగురించలేదు. అసలు జైనబ్ గార్కి ఈ సంబంధం మొదటినుంచే ఇష్టంలేదు. కాని దైవ ప్రవక్త (స) ప్రతిపాదనను కాదంటే, దైవాజ్ఞను ధిక్కరించినట్లవుతుందేమోనన్న భయంతో ఆమె ఈ సంబంధానికి అన్య మనస్కంగానే తలూపారు. అతి కష్టమ్మీద ఏడాది కాలంపాటు ఈ సంసార రథం ఎలాగో నడిచింది. చూడబోతే ఆ దంపతు లిద్దరూ ధర్మపరాయణులే. కాని వారి మనసులు కలవలేదు. కాపురంలో కలతలు రేగాయి. ఒకసారి జైద్ దైవప్రవక్త (స) దగ్గరకు వచ్చి, జైనబ్ గురించి ఫిర్యాదు చేశారు. "ఆమె ఈ మధ్య మరీ దురుసుగా మాట్లాడుతోంది. ఈ కాపురం నిలిచేట్లు లేదు. ఆమెకు విడాకులివ్వాలనుకుంటున్నాను" అన్నారు. అయితే తొందర పడి విడాకులివ్వొద్దని దైవప్రవక్త (స) జైద్‌కు సర్ది చెప్పారు. ఆ విషయాన్నే దివ్యఖుర్‌ఆన్ ఇలా ప్రస్తావించింది –

ఓ ప్రవక్తా! అల్లాహ్‌తోపాటు నువ్వు కూడా ఏ వ్యక్తికి ఉపకారం చేశారో ఆ వ్యక్తితో, "నీవు నీ భార్యను విడిచిపెట్టకు, అల్లాహ్‌కు భయపడు" అని చెబుతూ ఉండేవాడివి కదూ!

(అల్ అహ్జాబ్ – 37)

కాని కేవలం సిఫార్సులతో సంసారాలు చక్కబడవు. చివరకు హజ్రత్ జైద్ ఆమెకు విడాకులిచ్చేశారు.

వాస్తవానికి హజ్రత్ జైనబ్ (ర.అన్హా) మక్కాకు చెందిన ఒక కులీన స్త్రీ. కాగా; జైద్ ఏమో ఒక నల్లని బానిస పురుషుడు. బహుశా ఆ కారణంగానే మనసులు కలవలేదు. ఆమె కుటుంబీకులు కూడా ఈ సంబంధంపట్ల ఉదాసీనంగానే ఉండేవారు. కాని ఇది దైవప్రవక్త (స) నిర్ణయం గనక ఎవరూ బయటపడే వారు కాదు. మొత్తానికి ఈ వివాహం ద్వారా ఒక విషయం మాత్రం తేటతెల్లమయింది – కులీనులు, కులహీనులన్న వ్యత్యాసం ఇస్లాంలో లేదు. అగ్ర వర్ణానికి చెందిన ఒక ప్రముఖ వ్యక్తి ఎంతో స్వేచ్ఛనొసగబడిన ఒక బానిస వ్యక్తి కూడా అంతే!

విడాకుల అనంతరం 'ఇద్దత్' (గడువు కాలం) ముగియగానే దైవప్రవక్త (స) కు దైవాజ్ఞ అందింది –

"ఓ ప్రవక్తా! నీవు నీ దత్త పుత్రుడైన జైద్‌చే విడాకులు పొందిన మహిళను పెండ్లి చేసుకో."

కాని ఆ రోజుల్లో అరేబియాలో దత్త పుత్రుడు కూడా సొంత పుత్రునిగానే భావించబడేవాడు. అందువల్ల దైవప్రవక్త (స) దైవాజ్ఞను నెరవేర్చటానికి ఊగిసలాడసాగారు. మరోవైపు అల్లాహ్ ఈ ఆజ్ఞాన తలంపును సమాజంలో నిర్మూలించ దలిచాడు. అందుకే ఈ ఆజ్ఞ అవతరించింది –

"(ఓ ప్రవకా!) అల్లాహ్ బయటపెట్టదలచిన విషయాన్ని నీవు నీ మనస్సులో దాచి ఉంచావు. నీవు ప్రజలకు భయపడుతున్నావు. వాస్తవానికి నువ్వు భయపడాల్సింది అల్లాహ్‌కే (ప్రజలకు మాత్రం కాదు)." (అల్ అహ్జాబ్–37)

మరో వైపు అల్లాహ్ విమర్శకుల నోటికి తాళం వేస్తూ ఇలా సెలవిచ్చాడు: "ముహమ్మద్ మీలోని ఏ పురుషునికీ తండ్రి కారు... దత్త పుత్రులను వారి తండ్రులతో ఉన్న సంబంధం ప్రకారమే పిలవండి."

ఆ తర్వాత ఈ ఆజ్ఞ కూడా అవతరించింది: "తరువాత జైద్ ఆమె విషయంలో (విడాకులిచ్చి) తన కర్తవ్యాన్ని నెరవేర్చినపుడు, మేము ఆమెతో నీకు వివాహం జరిపించాము. విశ్వాసులకు తమ దత్త పుత్రుల భార్యల వ్యవహారంలో, వారు తమ భార్యలకు సంబంధించిన కర్తవ్యాన్ని నెరవేర్చినపుడు, ఏ విధమైన ఇబ్బందీ కలుగకుండా ఉండేందుకు (ఈ ఆదేశాన్ని విధించాల్సి వచ్చింది). అల్లాహ్ ఆదేశం అమలులోకి రావలసిందే."

కాబట్టి హజ్రత్ జైనబ్ (ర.అన్హా)తో దైవప్రవక్త (స) వివాహం జరిగిపోయింది.

(ఇంకావుంది)





విషాద సంవత్సరం

ఆధారం
అర్రహీఖుల్ మఖ్తూమ్



సంక్షిప్తీకరణ
సయ్యద్ అబ్దుస్సలాం ఉమ్రీ

నబవీ 10వ సంవత్సరం దైవ ప్రవక్త (స) గారి పెత్తండ్రి అబూ తాలిబ్ వ్యాధిగ్రస్తులయి కోలుకోలేని పరిస్థితికి లోనయ్యారు. ఆయన కాలం సమీపించింది అని గ్రహించి ప్రవక్త (స), ఆయన వద్దకు వెళ్ళి, **"మీరు కేవలం లా ఇలాహ ఇల్లల్లాహ్"** (అల్లాహ్ తప్ప మరో ఆరాధ్య దైవం లేదు) అన్న ఒక్క మాట అనండి. పెదనాన్నా! నేను ఈ కలిమా (వచనం) ఆధారంగా అల్లాహ్ వద్ద మీ కొరకు సిఫారసు చేస్తాను" అని బతిమిలాడారు. అక్కడ ముందునుండే ఉన్న అబూ జహల్ "అబూ తాలిబ్! అబ్దుల్ ముత్తలిబ్ మతాన్ని వదలిపెడతావా?" అంటూ ఏదేదో చెప్పటం మొదలెట్టాడు. చివరికి "అబ్దుల్ ముత్తలిబ్ మతంపైనే" అంటూ కన్ను మూశారు అబూ తాలిబ్. అబూ తాలిబ్ ఇస్లాం స్వీకరించకపోయినప్పటికీ ముస్లింలకు ఆయనగారి నైతిక మద్దతు ఉండేది. అయితే ఆ 'రక్షా కవచం' కూడా ఇప్పుడు లేకుండా పోయింది. అబూ తాలిబ్ మరణించిన రెండు మూడు నెలలకే విశ్వాసుల మాత (ఉమ్ముల్ మోమినీన్) హజ్రత్ ఖదీజా (ర.అన్హా) కూడా పరమపదించారు. అప్పటికి ఆమె వయస్సు 65 సంవత్సరాలు. ప్రవక్త (స) గారి వయస్సు 50 సంవత్సరాలు. హజ్రత్ ఖదీజా (ర.అన్హా) ప్రవక్త (స) గారి కోసం గొప్ప ఆదర్శవంతమైన ఇల్లాలు. 25 సంవత్సరాలు ఆయనపై ప్రేమానురాగాల్ని కురిపిస్తూ, కష్టసుఖాలలో చేదోడు వాదోడుగా ఉంటూ, ధర్మప్రచారంలో సహాయపడుతూ, ఆర్థికంగా ఎంతో ఆదుకుంటూ జీవించారు. ఆమెలోని ఈ త్యాగశీలాన్ని మెచ్చుకుంటూ ప్రవక్త (స) తరచు ఇలా అనేవారు: "ప్రజలు నన్ను వ్యతిరేకించినప్పుడు తను నన్ను విశ్వసించింది. ప్రజలు నన్ను తప్పు పట్టినప్పుడు తను మాత్రం నా మాట సత్యమని ధృవీకరించింది. ప్రజలు నన్ను ఆర్థికంగా దీవాలా తీయాలనుకున్నప్పుడు తను తన సొంత ఆస్తితో నన్నాదుకుంది. ఆమె ద్వారానే అల్లాహ్ నాకు సంతానాన్ని అనుగ్రహించాడు."

ఈ రెండు విషాద సంఘటనలు కొన్ని రోజుల తేడాతోనే సంభవించాయి. భరించరాని తీవ్ర ఆవేదనకి లోనయ్యారు ప్రవక్త (స). అబూ తాలిబ్ మరణానంతరం ఆయన తన జాతి వారిచే అనేక ఇక్కట్లను ఎదుర్కొన్నారు. వారి ఆగడాలు రాను రాను పెచ్చరిల్లాయి.

సౌదా (ర.అన్హా) గారితో వివాహం:

నబవీ శకం 10వ సంవత్సరంలోనే ప్రవక్త (స) జమ్ఆ కూతురు సౌదా (ర. అన్హా) ను వివాహమాడారు. ఆమె తొలి కాలంలో ఇస్లాం స్వీకరించినవారిలో ఒకరు. ఆమె తన భర్తతో అబిసీనియాకు వలస కూడా పోయారు. కాని భర్త అక్కడే మరణించారు. ఆమె అబిసీనియా నుండి తిరిగి వచ్చిన తర్వాత ప్రవక్త (స) ఆమెకు పెళ్ళి సందేశం పంపి ఆమెను వివాహమాడారు.



ధర్మ నిష్ఠకు గీటురాయి

మూలం :
హాఫిజ్ ఇబ్నె హజర్ అస్ఖలానీ (రహ్మ.అలై)
అనువాదం
ముహమ్మద్ అజీజుర్రహ్మాన్

(1) దైవప్రవక్త (సఅసం) చెప్పగా తాను విన్నానని హజ్రత్ నూమాన్ బిన్ బషీర్ (రజి) చెప్పారు. ఆ సమయంలో నూమాన్ తన రెండు వ్రేళ్లను తన చెవుల వైపునకు తీసుకెళ్ళారు – "హలాల్ (ధర్మం) కూడా సుస్పష్టమే హరామ్ (అధర్మం) కూడా సుస్పష్టమే. ఈ రెండింటి మధ్య కొన్ని అస్పష్టమైన విషయాలున్నాయి. జనుల్లోని అధికులకు వీటి గురించి తెలీదు. కనుక ఎవరయితే ఈ అస్పష్ట విషయాలకు కూడా దూరంగా ఉన్నాడో అతడు తన ధర్మాన్ని, తన మానమర్యాదలను కాపాడుకున్నాడు. మరెవరయితే అస్పష్ట అంశాలలో పడిపోయాడో అతడు అధర్మంలో చిక్కుకు పోయాడు. కావలివాడు చేనుకు దగ్గరలో పశువులకు కాపలాగా ఉంటాడు. పశువులు చేనుకు అవతల మేస్తూనే ఏదో ఒక దశలో గట్టు దాటి చేనులో పడతాయి. జాగ్రత్త! ప్రతి చక్రవర్తికీ సరిహద్దు ఉంటుంది. జాగ్రత్త! అధర్మ విషయాలు దేవుని సరిహద్దుల్లాంటివి. జాగ్రత్త! శరీరంలో మాంసపు ముద్ద ఒకటుంది. ఆ ముద్ద గనక బావుంటే శరీరమంతా బావుంటుంది. అది గనక చెడిపోతే శరీరమంతా చెడిపోతుంది. తస్మాత్ జాగ్రత! ఆ మాంసపు ముద్దే హృదయం." (బుఖారీ, ముస్లిం)

సారాంశం

ఈ హదీసు చాలా ముఖ్యమైనది. ఇస్లాం మూల సూత్రాలకు సంబంధించినది. ఇందులో ధర్మమేదో, అధర్మమేదో నిర్దిష్టంగా వేరుచేసి చెప్పటం జరిగింది. అయినప్పటికీ కొన్ని అస్పష్టంగా ఉంటాయి. వాటికి సంబంధించి ఊగిసలాట, సందిగ్ధావస్థ నెలకొంటూ ఉంటుంది. అలాంటి అస్పష్ట, అనుమానాస్పద విషయాలు 'హరాం' అని కూడా ఖచ్చితంగా చెప్పబడి ఉండదు. అలా అని 'హలాల్' అనడానికి కూడా తగు ఆధారం కనబడదు. రెండు విధాలుగా కూడా అర్థం చేసుకోవడానికి ఆస్కారం ఉంటుంది. ఇలాంటి అస్పష్టమయిన విషయాలకు దూరంగా ఉండటమే శ్రేయస్కరం.

పోతే; శరీరం యొక్క స్వస్థత లేదా అస్వస్థత అనేది హృదయస్థితిపై ఆధారపడి ఉంటుందనీ, ఒక రాజ్యంలో రాజ్యాధిపతికి ఉన్న కీలక స్థానమే శరీరంలో హృదయానికి ఉంటుందనీ, శరీరంలోని మిగతా అవయవాలన్నీ దాని నైర్మల్యంపై, నిష్కల్మషత్వంపై ఆధారభూతమై ఉంటాయని హదీసు చెబుతోంది. ' యధారాజా తథా ప్రజ ' అన్నట్లు చక్రవర్తి సజ్జనుడై ఉంటే ప్రజలు కూడా సద్వర్తననే అలవరచుకుంటారు. చక్రవర్తే దుర్మార్గుడు, దుష్టుడు అయినపుడు ప్రజల నుండి మంచిని ఎలా ఆశించగలం?!

(2) హజ్రత్ అబూహురైరా (రజి) కథనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధనం: "దీనారు, దిర్హము, పట్టు వస్త్రాల దాసుడు నాశనమైపోవుగాక! – అవి లభించినంతకాలం సంతృప్తి చెందుతాడు. లభించకపోతే అసంతృప్తికి గురవుతాడు." (బుఖారీ)

సారాంశం

బంగారు, వెండి పట్టు వస్త్రాలు కలిగి ఉండటం, డబ్బును సంపాదించటం తప్పుకాదుగాని మనిషి ధనపూజలో లీనమవటం, వెండీ బంగారాలను, వజ్రవైఢూర్యాలను, పట్టు పీతాంబరాలను ప్రోగుచేసుకోవటమే అసలు జీవిత ధ్యేయంగా ఎంచుకోవటం విపరీతం. ఈ ధన దాహం కూడా ఒక రకమయిన రుగ్మతే. దానికి లోనైనవాడు పరమ పీనాసిగానయినా మారిపోతాడు. లేదా అడ్డదారులైనా తొక్కుతాడు. తాను లక్ష్యంగా పెట్టుకున్నంత ధనాన్ని ప్రోగుచేసుకోగానే తలబిరుసుతనం వచ్చేస్తుంది. నేలపై నిక్కుతూ నడవసాగుతాడు. తన ఆస్తినీ, అంతస్థును లోకానికి చాటిచెప్పే ఉద్దేశ్యంతో లేనిపోని పోకడలు పోతాడు. ఎందుకంటే అతన్ని 'ఖారూనీ తత్వం' ఆవహిస్తుంది. ధన వ్యామోహంలో దారుణంగా చిక్కుకున్న ఖారూన్ కుబేరునికి పట్టిన గతేమిటో తెలిసిందే కదా!

అందుకే ఆస్తిపరుడైనవాడు అణకువతో ఉండాలి. డబ్బును, బంగారాన్ని ఎక్కడుంచాలో అక్కడే ఉంచాలి. తన అభిరుచి అన్యాల్ని ఇరకాటంలో పెట్టకుండా సంయమనాన్ని, సమయస్ఫూర్తిని ప్రదర్శించాలి. దేవుడు తనకు అనుగ్రహించిన దాంతో దైవదాసుల్లో లేమికి గురైన వారిని ఆదుకుంటూ ఉండాలి.



ఖుర్‌ఆన్ పాఠం



దైవ విధేయులుగానే బ్రతకండి దైవ విధేయులుగానే చావండి



-అబ్దుల్ ఖాదర్ ఉమ్రి

విశ్వప్రభువైన అల్లాహ్ సెలవిస్తున్నాడు:-

"విశ్వసించిన ప్రజలారా! అల్లాహ్‌కు ఏ విధంగా భయపడాలో ఆ విధంగా భయపడండి, ముస్లింలుగా తప్ప మీరు మరణించకండి" (3:102).

ఈ వాక్యంలో అల్లాహ్ తనను విశ్వసించిన దాసులను ఉద్దేశించి రెండు విషయాలను నొక్కి చెప్పాడు: (1) విశ్వాసులు అల్లాహ్‌కు భయపడ వలసిన విధంగా భయపడాలి. (2) వారు ముస్లిములుగానే జీవించాలి, ముస్లిములుగానే మరణించాలి.

దివ్యఖుర్‌ఆన్‌లో " ఇత్తఖుల్లాహ్ " (అల్లాహ్‌కు భయపడండి) అనే వచనం ఎన్నో మార్లు, ఎన్నో సందర్భాల్లో వచ్చింది. ఉదాహరణకు కొన్ని వాక్యాలు:

(1) విశ్వాసులారా!... అల్లాహ్ మీకు ప్రసాదించిన ధర్మ సమ్మతమూ, పరిశుద్ధమూ అయిన ఆహారాన్ని తినండి. త్రాగండి. మీరు విశ్వసించిన **అల్లాహ్‌కు భయపడండి.** (5:88) ఇక్కడ అధర్మమైన, అపరిశుద్ధమైన అన్న పానీయాల జోలికి వెళ్ళవద్దని చెప్పడం జరిగింది – ఇదే తఖ్వా.

(2) విశ్వాసులారా! ఇబ్బడి ముబ్బడిగా పెరిగే వడ్డీని తినటం మానండి. **అల్లాహ్‌కు భయపడండి.** మీరు సాఫల్యం పొందే అవకాశం ఉంది. (3:130)

విశ్వాసులారా! మీరు నిజంగా విశ్వాసులే అయితే **అల్లాహ్‌కు భయపడండి.** మీకు ప్రజల నుండి రావలసిన వడ్డీని విడిచిపెట్టండి. (2:278)

ఈ వాక్యాలలో వడ్డీ వ్యాపారం చేయడం, వడ్డీని తినటం మానివేయాలని తాకీదు చేయబడింది – వీటికి దూరంగా ఉండటమే తఖ్వా.

(3) విశ్వాసులారా! అతిగా అనుమానించటం మానివేయండి. కొన్ని అనుమానాలు పాపాలు అవుతాయి. గూఢాచారులుగా వ్యవహరించకండి. మీలో ఎవరూ ఎవరినీ పరోక్షంగా నిందించరాదు. మీలో ఎవరైనా మీ మృత సోదరుని మాంసం తినటానికి ఇష్టపడతారా? చూడండి. మీరే స్వయంగా దీనిని అసహ్యించుకుంటారు. **అల్లాహ్‌కు భయపడండి.....** (49:12). ఇక్కడ ప్రతి మనిషి ఆత్మ పరిశీలన చేసుకొని తన జీవితాన్ని సంస్కరించుకోవటానికి ప్రయత్నించాలని హితబోధన చేయడం జరిగింది.

(4) **అల్లాహ్‌కు భయపడండి...** కొలపాత్రలను పూర్తిగా నింపండి. ఎవరికీ తక్కువచేసి ఇవ్వకండి. సరియైన తరాజుతో తూయండి. ప్రజలకు వారి వస్తువులను తక్కువచేసి ఇవ్వకండి. భూమిపై కల్లోలాన్ని వ్యాపింప జేస్తూ తిరగకండి (26:179-183). ఇక్కడ మోసపూరిత వాతావరణాన్ని ఖండించడం జరిగింది. జనులు నీతి నిజాయితీకి కట్టుబడి ఉండాలని చెప్పబడింది.

(5) ..... ఏదైనా వర్గంతో ఉన్న వైరం కారణంగా మీరు ఆవేశానికి లోనై న్యాయాన్ని త్యజించకండి. న్యాయం చెయ్యండి. ఇది దైవభక్తికి చాలా చేరువైనది. **అల్లాహ్‌కు భయపడండి.** మీరు చేసేదంతా అల్లాహ్‌కు బాగా తెలుసు (5:8). ఈ వాక్యంలో ఎట్టి పరిస్థితిలోనూ న్యాయానికే కట్టు బడి ఉండాలని నొక్కి చెప్పడం జరిగింది.


(6) **అల్లాహ్‌కు భయపడండి...** మీరు ప్రపంచంలోని ప్రాణులలో పురుషుల వద్దకు పోతారేమిటి? మీ ప్రభువు మీ భార్యలలో మీకై సృష్టించిన దానిని విడిచి పెడుతున్నారేమిటి? మీరు హద్దులన్నీ అతిక్రమించారు. (26:165,166)

ఇక్కడ లైంగిక విశృంఖలత్వాన్ని ఖండిస్తూ ప్రజలు లైంగిక తృప్తి కోసం అసహజ పద్ధతులు అవలంబించరాదని చెప్పబడింది.

(7) **అల్లాహ్‌కు భయపడండి...** హద్దులు మీరే వారి పట్ల విధేయత చూపకండి. వారు భూమిలో ఉపద్రవాన్ని సృష్టిస్తారు. ఏ సంస్కరణనూ చేపట్టరు (26:150-152). .....మంచికి, దైవభక్తికి సంబంధించిన పనులలో (అందరితోనూ) సహకరించండి.పాప కార్యాలలో, అత్యాచారాలలో (ఎవరితోనూ) సహకరించకండి. అల్లాహ్‌కు భయపడండి. నిశ్చయంగా అల్లాహ్ కఠినంగా శిక్షించేవాడు (5:2).

ఈ వాక్యాలలో తీవ్రవాదాన్ని, ఉగ్రవాదాన్ని ఖండించడం జరిగింది.

(మిగతా భాగం 20వ పేజీలో)



చెప్పుకోండి చూద్దాం


– అబుల్ హసన్

(1) పుత్ర ప్రాప్తి కోసం మూడు రోజులు ఉపవాసం ఉన్న ప్రవక్త ఎవరు?
(2) ప్రవక్త సులైమాన్ (అలైహిస్సలాం) సేనల బారి నుండి తన జాతి వారిని కాపాడిన కీటకమేది?
(3) ముస్లింలు 'కాబా' దిశగా తిరిగి చేసిన తొలి నమాజు ఏది?
(4) సమస్త లోకాల స్త్రీల ్ల ఉత్తములాలు ఎవరు?
(5) ఫిర్‌ఔన్‌పై అల్లాహ్ పంపిన శిక్షలు ఎన్ని? అవి ఏవి?
(6) మక్కాలో తొలిసారి ఖుర్‌ఆన్‌ని బిగ్గరగా చదివిన సహాబీ ఎవరు?
(7) "విలపించకు, అల్లాహ్ మనకు తోడుగా ఉన్నాడు" అని ప్రవక్త ముహమ్మద్ (స) ఎవర్ని, ఎప్పుడు ఓదార్చారు?
(8) 12 మంది కుమారులు గల ప్రవక్త పేరేమిటి?
(9) ప్రళయం ఏ రోజు సంభవిస్తుంది?
(10) ప్రవక్త మూసా (అలైహిస్సలాం) కర్రతో చట్టుబండపై కొట్టగా ఎన్ని జలధారలు జాలువారాయి?
(11) దైవ ప్రవక్త యాకూబ్ (అలైహిస్సలాం)కు గల మరో పేరేది?

గత సంచిక సమాధానాలు

(1) ఆయతుల్ కుర్సీ (2) తీన్ (అంజూరం), జైతూన్, ఇనబ్, **ఖర్జూరం (3) సూరయె బఖర (4) సూరయె ముల్క్ (5) సూరయె ఇఖ్లాస్ (6) 70 మంది (7) 950 ఏండ్లు (8) సూరయె ఇన్సాన్, సూరయె గాషియా (9) సూరయె ఫలఖ్, సూరయె నాస్ (10) ప్రవక్త ఇబ్రాహీమ్ (అలైహిస్సలామ్).**

షేరక్ క్విజ్



షేఖ్ హబీబుర్రహ్మాన్ జామయి

ప్రశ్న: హజ్రత్ ఖదీజా (ర,అన్‌హా) ద్వారా మహా ప్రవక్త (స) గారికి కలిగిన సంతానం?
జవాబు: ఇద్దరు కుమారులు, నలుగురు కుమార్తెలు.
కుమారులు: (1) ఖాసిం (బాల్యంలోనే మరణించారు) (2) అబ్దుల్లాహ్. అయన్ని తయ్యిబ్, తాహిర్ అని జనులు అని పిలిచేవారు. ఆయన కూడా బాల్యంలోనే మరణించారు.
కుమార్తెలు: (1) జైనబ్ (ర.అన్‌హా)– ఈమె భర్త పేరు అబుల్ ఆస్. (2) రుఖయ్యా (ర.అన్‌హా) – తొలి భర్త అబూ లహబ్ కొడుకు ఉత్‌బా. విడాకుల తర్వాత ఉస్మాన్ బిన్ అఫ్ఫాన్ (ర)తో వివాహం జరిగింది. (3) ఉమ్మె కుల్సూమ్ (ర.అన్‌హా) – రుఖయ్యా మరణించిన తర్వాత ఉస్మాన్ బిన్ అఫ్ఫాన్ (ర) గారే ఈమెనూ వివాహమాడారు. (4) ఫాతిమా (ర.అన్‌హా) – భర్త పేరు అలీ బిన్ అబీ తాలిబ్ (రజి).

ప్రశ్న: ప్రవక్త (స) గారి పెదనాన్న, చిన్నానల్లో ఇస్లాం ఎవరు స్వీకరించారు?
జవాబు: (1) హజ్రత్ అబ్బాస్ (రజి) (2) హజ్రత్ హమ్జా (రజి).

ప్రశ్న: ప్రవక్త పదవి లభించక పూర్వం జరిగిన 'హిల్‌ఫుల్ ఫుజూల్' ఒప్పందం ముఖ్య ఉద్దేశం ఏమిటి? దీనిలో ప్రవక్త (స) పాల్గొన్నారా?
జవాబు: 'హిల్‌ఫుల్ ఫుజూల్' ఒప్పందంలో సమాజంలో ఎవరికీ ఎలాంటి అన్యాయం జరగకూడదని, పీడితులకు సహాయం అందించాలని, బాటసారులకు రక్షణ కల్పించాలని, ఇక నుండి ఇరువర్గాల మధ్య ఎలాంటి పోరు జరగరాదని నిర్ణయించడం జరిగింది. ఈ ఒప్పందంలో ప్రవక్త (స) కూడా పాల్గొన్నారు.


ప్రశ్న: యుక్త వయసులో ప్రవక్త (స) ఎలా ఉండేవారు?
జవాబు: సమాజంలో ఒక ఉత్తమ వ్యక్తిగా, సమాజ శ్రేయం కోరేవారుగా ఉండేవారు. ఆయన ఎక్కువ మౌనంగా ఉండేవారు. ఏకాంతంలో అల్లాహ్‌ను స్మరించేవారు. మద్యపానాన్ని, విగ్రహాల పేరున బలిచేసిన జంతువుల మాంసాన్ని తినటాన్ని అసహ్యించుకునేవారు. ఏ విగ్రహం ముందు కూడా ఆయన తల వంచలేదు.

ప్రశ్న: ఖుర్‌ఆన్‌లో 'ముహమ్మద్' అన్న పేరు ఎన్ని సార్లు వచ్చింది?
జవాబు: 4 సార్లు. (1) 3: 144 (2) 33: 40 (3) 47: 2 (4) 48: 29.

ప్రశ్న: తౌరాత్ (పాత నిబంధన)లో మహా ప్రవక్త (స) గారి పేరు ఏ విధముగా తెలుపబడింది?
జవాబు: ఫార్ఖలీద్ (farqaleed).

ఇస్లాం శిక్షణ

ఇస్లాం విశ్వజనీన ధర్మం



– హాఫిజ్ ఎస్.ఎమ్ రసూల్

ఇస్లాం అంటే ఏమిటి? ముస్లిములు ఎవరు? ఇస్లాం ప్రకృతి ధర్మమా? ముస్లింగానే ఎందుకు ఉండాలి? ఇస్లాం ధర్మం ప్రాథమిక విధులు ఏవి?

ప్రపంచంలో అనేక మతాలు లేవు. ఒకవేళ ఉన్నా అవన్నీ దేవుని సన్నిధిలో ఆమోదించబడవు. మొట్టమొదటి ప్రవక్త ఆదం (అలైహిస్సలాం) నుంచి చిట్టచివరి ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) వరకు దైవ ప్రవక్తలందరిదీ ఒకే మతం. అదే ఇస్లాం. దివ్య ఖుర్‌ఆన్‌లోని మూడవ సూరాలోని 19వ సూక్తిలో ఇలా సెలవీయబడింది;

"ఇన్నద్దీన ఇన్‌దల్లాహిల్ ఇస్లాం"
(అల్లాహ్ దృష్టిలో ధర్మం కేవలం ఇస్లాం మాత్రమే)

'ఇస్లాం' అనే పదానికి అర్పణం, లొంగిపోవటం, కట్టుబడి ఉండటం, విధేయత చూపటం, స్వయం సమర్పణ, శిరసావహింపు, ఆజ్ఞాపాలన అనే అర్థాలు ఉన్నాయి. దేవుడికి, దేవుడు సూచించిన జీవన సంవిధానానికి తిరుగులేని విధంగా కట్టుబడి ఉండటమే ఇస్లాం మతం. ఇస్లాం మానవాళి కొరకు సమ్మతించి ఆమోదించబడిన సత్యధర్మం. ఇస్లాం ధర్మాన్ని అవలంబించేవారు 'ముస్లింలు'గా పిలువబడతారు. ముస్లింలు దేవుని ఏకత్వంపై తిరుగులేని విశ్వాసం కలిగివుంటారు. దైవత్వంలో మరెవ్వరికీ భాగస్వామ్యం అంటగట్టరు. దేవుడు సూచించిన జీవన సంవిధానాన్ని మనసా వాచా కర్మణా ఆచరిస్తారు.

ఇస్లాం ప్రకృతి ధర్మం అని ఎలా చెప్పగలము?

ప్రపంచంలోని మతాలన్నింటినీ ఒకసారి పరిశీలించండి. క్రీస్తు ప్రవక్త అనుయాయులు తమ మతాన్ని తమ ప్రవక్త పేరే పెట్టుకున్నారు. సింధూ నదీ తీరాన ఆవిర్భవించిన మతం సింధూ లేక హిందూ మతంగా ప్రఖ్యాతి గాంచింది. యూదుల్లోని ఒక ప్రత్యేక తెగ యహూదా మూలంగా యూద మతానికి ఆ పేరు వచ్చింది. గౌతమ బుద్ధుడు స్థాపించిన మతం బౌద్ధ మతం అయింది. ఈ విధంగా ప్రపంచంలోని ఇతర మతాలన్నీ కూడా వాటిని స్థాపించిన వారి పేర్లతోనో లేక అవి ఆవిర్భవించిన ప్రాంతం, తెగల పేర్లతోనో నామకరణం చేయబడ్డాయి. కానీ ఇస్లాం మాత్రం వీటన్నింటికీ భిన్నంగా ఒక సహజమైన పదంతో నామకరణం చేయబడింది. ఇస్లాం అంటే కట్టుబడి ఉండటం. విధేయత చూపటం. సృష్టి తన సృష్టికర్తకు విధేయత చూపుతుంది. అతని ఆజ్ఞలకు లోబడి మసలుకుంటుంది. అదే విధంగా మనిషి తన సృష్టికర్తకు విధేయత చూపుతూ, ఆయన ఆజ్ఞలను శిరసావహిస్తూ జీవించడమే ఇస్లాం ధర్మం.

మనిషి ముస్లింగానే ఎందుకు ఉండాలి?

దేవుడు మనిషిని పుట్టించి తాను అతని కోసం నిర్ణయించిన జీవన విధానమేదో అతనికి తన ప్రవక్తల ద్వారా తెలియపరిచాడు. ధర్మాధర్మాలను పరికించి సరైన నిర్ణయాలు తీసుకునే శక్తిసామర్థ్యాలు కూడా అతనిలో పొందుపరచాడు. మానవుడు బుద్ధిజీవి. విశ్వంలో ఇతర సృష్టిరాసుల్లాగా తను కూడా సృష్టికర్త నిబంధనావళికి, ఆయన సూచించిన జీవన సంవిధానానికి కట్టుబడి ఉండాలనీ, ఆయన దృష్టిలో ఇస్లాం మాత్రమే సత్య ధర్మమనీ అతని అంతరాత్మ మాటిమాటికీ ప్రబోధిస్తూనే ఉంటుంది. అలాంటప్పుడు మనిషి ఇస్లాం ధర్మాన్ని వదలిపెట్టి ఇతర మతాలను ఆశ్రయిస్తే అతని సృష్టికర్త దాన్ని ఎలా అంగీకరిస్తాడు? దివ్య ఖుర్‌ఆన్‌లో మూడవ సూరాలోని 85వ సూక్తిలో ఇలా చెప్పబడింది;

"ఎవరైనా ఈ విధేయతా మార్గాన్ని (ఇస్లాంను) కాక మరొక మార్గాన్ని అవలంబించదలిస్తే ఆ మార్గం ఎంతమాత్రం ఆమోదించబడదు. అలాంటి వాడు పరలోకంలో విఫలుడవుతాడు, నష్టపోతాడు."

ఇస్లాం ధర్మ ప్రాథమిక విధులు

ప్రాథమిక విధులు ఇస్లాం ధర్మానికి ప్రాణం వంటివి. ఇస్లాం ధర్మాన్ని ఒక పటిష్ఠమైన భవనంగా గనక ఊహించుకుంటే ప్రాథమిక విధులు దాని స్తంభాల్లాంటివని చెప్పొచ్చు. వాటిలో ఏ ఒక్క స్తంభం బలహీనమయినా ఇస్లాం భవనం మొత్తం కుప్పకూలిపోయే ప్రమాదముంది. ఆ ప్రాథమిక విధులు ఐదు;

1) కలిమా (అల్లాహ్ తప్ప వేరొక ఆరాధ్య దేవుడు లేడనీ, ముహమ్మద్ (స) దైవ ప్రవక్త అని మనస్ఫూర్తిగా అంగీకరించి నోటితో పలకటం)
2) నమాజ్ వ్యవస్థను నెలకొల్పటం
3) జకాత్ (విధి దానం) సొమ్ము చెల్లించటం
4) రమజాన్ మాసంలో ఉపవాసాలు పాటించటం
5) స్థోమత కలిగినవారు కాబా గృహ యాత్ర (హజ్) చేయటం.



ఆస్తి పాస్తులు, ఆలు బిడ్డలు అవరోధం కారాదు



- షేఖ్ బిలాల్

ఈ లోకం శాశ్వతం కాదని ప్రతి ఒక్కరికీ తెలుసు. అయినా దాని వెంటే మనిషి పరుగెడుతున్నాడు. స్వర్గ సుఖాలు పొందడం కొరకు ఉత్తమమైన మార్గాలను అల్లాహ్ మనకోసం సులభతరం చేసియున్నాడు. అయినా మనం వాటిని చేరుకోలేక పోతున్నాము. ఒక ముస్లిం హృదయంలో అన్నింటికంటే ఎక్కువగా అల్లాహ్ మరియు ప్రవక్త ముహమ్మద్ (స.అ.సం) ప్రేమకే ప్రాధాన్యత వుంటుంది, వుండాలి కూడా. అలాంటి వారినే అల్లాహ్ ఎక్కువగా ప్రేమిస్తాడు. అన్ని విధాలా వారికి తోడై వుంటాడు. అలాంటివారు దైవ ప్రసన్నతను తమ జీవిత పరమావధిగా ఎంచుకొంటారు. అల్లాహ్‌ను మెప్పించడానికి శాయశక్తులా ప్రయత్నిస్తారు. వారే సత్పురుషులలోని వారు. వారి కొరకు స్వర్గంలో శ్రేణులు వున్నాయి. అల్లాహ్ మనల్ని కరుణించి వాటిని పొందేభాగ్యాన్ని ప్రసాదించు గాక! (ఆమీన్). అలాగే విశ్వాసికి అల్లాహ్ దారిలో మరియొక ఆటంకం కూడా వుంటుంది. ప్రతి విశ్వాసి ఈ విషయంలో జాగ్రత్తగా మెలగాలి.అదేమంటే;

ఆలు బిడ్డలపై ఉన్న అమితమైన ప్రేమానురాగాలు

భార్యాపిల్లలపై ఉన్న అమితమైన ఈ ప్రేమాను రాగాలు హద్దులు మీరితే ఒక దాసునికి అల్లాహ్‌తో ఉండవలసిన సంబంధ బాంధవ్యాలు తెగిపోతాయి. భార్యాపిల్లల ప్రేమలో పడి దైవ ప్రేమను క్షీణింపజేసు కొంటాడు. భార్యాపిల్లల పోషణే తన బాధ్యత అని తన బుద్ధీ వివేకాలు అన్నీ కూడా వారిని సుఖ పెట్టడంలోనో, సంతోషపెట్టడంలోనో వెచ్చిస్తూ కాలాన్ని వృధా చేస్తుంటాడు. కానీ భార్యాపిల్లల హక్కులకన్నా అల్లాహ్ హక్కులే మిన్న అని మహనీయ ముహమ్మద్ (స.అ.స) జీవన సరళి ద్వారా తెలుస్తున్నది. అల్లాహ్‌తో వుండవలసిన సంబంధం తరువాతనే మిగిలిన బంధాలన్నీ కూడా! కేవలం భార్యాపిల్లల్ని పోషించడమే ఇస్లాం కాదు, ఇస్లాంలో అది ఒక భాగం మాత్రమే.

నమాజు కొరకో లేక ధర్మసంస్థాపన కొరకో ఆహ్వానిస్తే తమ యజమాని అరుస్తాడనో లేక వుద్యోగం పోతుందనో, వుద్యోగంపోతే భార్యా పిల్లల్ని ఎలా పోషించేది అని కొంత మంది అంటుంటారు. అలాంటివారికి ప్రవక్త ముహమ్మద్ (స.అ.స) గారి జీవిత చరిత్ర, సహబీల జీవిత చరిత్ర గుర్తుకు రావడం లేదా? వాళ్ళు ఎలా పస్తులు గడిపారో, విశ్వనాయకుడు (స.అ.స) కడుపుకు రాళ్ళు కట్టుకొని ఎలా జీవితాన్ని వెళ్లదీశారో మరచిపోయారా? అనుచరులలో కొంత మంది ఖలీఫాలుగా వుండి చాలీచాలని గుడ్డలతో గడపలేదా? ధర్మ ప్రచారంలో భార్యాబిడ్డల్ని సైతం వదిలేసి ఎలా పాటుపడ్డారో గుర్తుకు రావడంలేదా? మరి ఈనాడు మనము ముస్లిములుగా ఎలా అయ్యాము? ఆనాడు సహాబీలు – మన కెందుకులే, మనం మాత్రం నమాజు చేసుకుంటే సరిపోతుందని తృప్తిపడి ఉండుంటే ఈనాడు ఈ ధర్మం మనవరకు చేరివుండేదా?

"విశ్వసించి అల్లాహ్ మార్గంలో ఇల్లువాకిలీ వదిలిపెట్టి తమ ప్రాణాలతో, తమ సంపదలతో పోరాడినవారి అంతస్తే అల్లాహ్ దృష్టిలో గొప్పది. అట్టివారే సఫలీకృతులు."

(అత్ తౌబా 20)

అనే దివ్య ఖుర్‌ఆన్ బోధన నిత్యం మనకు గుర్తుండాలి. ఆనాడు సహాబీలు అయితేనేమి, మహా పురుషులు అయితేనేమి వారు తమ భార్యాపిల్లల్ని, తల్లితండ్రులను, స్వదేశాన్ని వదిలేసి అల్లాహ్ మార్గంలో పోరాడారు. ఆ ప్రయత్నాలలోనే వారు జీవితాలను అర్పించారు. అల్లాహ్ వారికి ఉత్తమ స్వర్గ సుఖాలను ప్రసాదించుగాక (ఆమీన్). అలా ఎన్నో కష్టాలకు, నష్టాలకు ఓర్చుకొని మనవరకు చేర్చిన ఈ ధర్మాన్ని మన వంతుగా కృషిచేసి గడప గడపకు చేరవేద్దాం.

సృష్టికర్త మనతో చేసుకొన్న వ్యాపార ఒప్పందం మరచితిరా! **"అల్లాహ్ వారి ప్రాణాలను, వారి సంపదలనూ స్వర్గానికి బదులుగా కొన్నాడు"**

(అత్ తౌబా– 111)

జాగ్రత్త! అల్లాహ్ తన చివరి నిర్ణయం కూడా తెలియజేస్తున్నాడు: **"ఒకవేళ మీరు విముఖులైతే అల్లాహ్ మీ స్థానంలో మరో జాతిని దేన్నయినా తీసుకువస్తాడు. వారు మీవంటి వారై ఉండరు."**

(ముహమ్మద్ 38)

ఇన్‌షా అల్లాహ్ చివరి శ్వాస వరకూ ధర్మ సంస్థాపన కొరకు ప్రయత్నిస్తాం. దాన్నే జీవిత పరమావధిగా భావిద్దాం.



అర్ధ శతాబ్ది ఆంధ్రప్రదేశ్ - ఒక చూపులో !

(6వ పేజీ తరువాయి...)

'తెలుగుదేశం' హవా చెక్కు చెదరలేదు. రాష్ట్రంలో 42 స్థానాలకుగాను టి.డి.పి. దాని మిత్ర పక్షాలు కలిసి 32 లోక్‌సభ సీట్లు గెలుచుకున్నాయి. దరిమిలా అన్నగారు అసెంబ్లీకి కూడా మధ్యాంతర ఎన్నికలు (1985) జరిపించి మూడింట రెండొంతుల మెజారిటీతో తన అధికారాన్ని సుస్థిరం చేసుకున్నారు. నాదెండ్ల భాస్కరరావు సారథ్యంలోని ' ప్రజాస్వామ్య తెలుగుదేశం ' అడ్రసు లేకుండా పోయింది. మజ్లిస్ అండతో మలక్‌పేట నియోజకవర్గంలో పోటీ చేసిన నాదెండ్ల భాస్కరరావు బి. జె. పి. అభ్యర్థి శ్రీ ఇంద్రసేనారెడ్డి చేతిలో పరాజయం పాలైనారు. ఈ విధంగా తెలుగు ఓటర్లు తమ విలక్షణ పంథాను మరోసారి చాటుకున్నారు.

విరుద్ధ భావాల నిలయుడు

ఎన్. టి. రామారావు గార్కి జాతీయ రాజకీయాలపై మోజు పెరిగింది. నేషనల్ ఫ్రంట్‌ను స్థాపించి ఢిల్లీలో చక్రం తిప్పాలని ఆరాట పడ్డారాయన. అదే సమయంలో రాష్ట్రాభివృద్ధి పట్ల శ్రద్ధ సన్నగిల్లింది. ఈయన ధోరణిపై కినుక వహించిన హస్తిన దొరలు, రాష్ట్రానికి నిధుల కేటాయింపు విషయంలో సవతిప్రేమను ప్రదర్శించసాగారు. ఫలితంగా ఆంధ్రప్రదేశ్ ప్రగతి కుంటుపడింది. దానికితోడు ఎన్.టి.ఆర్ విరుద్ధ భావాలకు నిలయమైన విచిత్ర వ్యక్తిగా పేరు మోశారు. అన్న పరిపాలనపై ప్రజలకు విరక్తి పుట్టింది. ఫలితంగా 1989 లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో టి.డి.పి. పరాజయం పాలైంది. ఎన్.టి.రామారావు చొరవతో ఏర్పడిన నేషనల్ ఫ్రంట్ కేంద్రంలో అధికారంలోకి వచ్చింది. శ్రీ వి.పి.సింగ్ ప్రధాని అయ్యారు. కాని ఎన్.టి.రామారావు మాత్రం సినీమాలకు పరిమితం అయ్యారు.

చరిత్ర పునరావృతమయింది

1989లో డా. చెన్నారెడ్డి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా సెకండ్ ఇన్నింగ్ మొదలెట్టారు. కాని అసమ్మతివాదులు ఆయన్ని ఎక్కువ స్కోరు చేయనివ్వ లేదు. 1991 ఆరంభంలోనే శ్రీ నేదురుమల్లి జనార్థనరెడ్డి ముఖ్యమంత్రిగా తెరకెక్కారు. అయినా కాంగ్రెస్‌లో లుకలుకలు సద్దుమణగలేదు. ఆనక మళ్ళీ కోట్ల విజయభాస్కరరెడ్డిగారే టేల్ ఎండర్‌గా వచ్చి మరోసారి (1994)లో రాష్ట్రాధికారాన్ని 'మేజర్ చంద్రకాంత్' కి కట్టబెట్టి వెళ్ళారు.

అల్లుడా మజాకా !

అసెంబ్లీలో బ్రూట్ మెజారిటీ ఉన్నప్పటికీ 'అన్న' నిలువలేకపోయారు. ఈసారి పోరు కాంగ్రెతో కాదు, అల్లుళ్ళ బెడద మొదలయ్యింది. ఆయన భార్య లక్ష్మీపార్వతి రాజకీయ ప్రమేయాన్ని అల్లుళ్ళు గానీ, కుమారులుగానీ సహించలేకపోయారు. కుటుంబ గొడవలు రచ్చకెక్కాయి. 150 మంది టి.డి.పి. ఎమ్మెల్యేలతో చంద్రబాబు వైస్రాయ్ హోటల్‌లో మోహరించారు. ఎన్. టి. రామారావు తన శ్రీమతితో సహా జీపులో వచ్చి, హోటల్‌ను విడిచి బయటికి వస్తే అన్నీ వివరిస్తామని మైకులో ప్రాధేయపడాల్సిన దయనీయ పరిస్థితి వచ్చింది. కాని ఫలితం శూన్యం. అన్న మరోసారి ప్రజల్లోకి వెళ్ళి 'తనకు అన్యాయం జరిగిపోయింద' ని చెప్పుకున్నారు. కాని మెజారిటీ శాసన సభ్యులు చంద్రబాబు వెంట ఉండటంతో ఎవరూ చేసేదేమి లేక పోయింది.

చంద్రబాబు పర్వం

1996లో మొదలైన చంద్రబాబు పర్వం 2004 వరకూ వినా అప్రతి హతంగా సాగింది. వ్యవసాయ ప్రధానమైన రాష్ట్రాన్ని పారిశ్రామిక రాష్ట్రం గా మార్చే దిశలో ఈయన ప్రయత్నించారు. హైదరాబాదును హైటెక్ సిటీ గా తీర్చిదిద్దే యత్నం చేశారు. కాని అదే సమయంలో రైతులను ఉపేక్షిం చారు. దానికితోడు అనావృష్టి, జిల్లాలలో కరువు రక్కసి తాండవించింది. కరెంటు బిల్లులు చెల్లించలేక రైతులు విలవిల్లాడిపోయారు.

చంద్రశేఖర ప్రతాపం

చంద్రబాబు చాలా తెలివైనవారే. దేవేందర్ గౌడ్, మాధవరెడ్డి లాంటి చురుకైన వ్యక్తులను చేరదీసిన చంద్రబాబు 'చందూ మహారాజ్' లాంటి పదునైన రాజకీయవాదిని ఎందుకు దూరంగా ఉంచారో అంతుబట్టదు. అదే ఆయనకు రాజకీయంగా విద్యుదాఘాతం అయింది. సిద్ధిపేట సమీపం లోని చింతమడక వాస్తవ్యులు శ్రీ చంద్రశేఖరరావు. ఒకప్పటి రాష్ట్రమంత్రి మదన్‌మోహన్ దగ్గర శిష్యరికం చేసిన చంద్రశేఖరరావు, 1983లో టి.డి.పి. అభ్యర్థిగా సాక్షాత్తు గురువునే ఓడించి అందరి దృష్టినీ ఆకర్షించారు. ఆనాటి నుంచీ సిద్ధిపేట నియోజక వర్గం ఆయనకు సుస్థిర స్థావరంగా ఉంది. ఒకసారి చంద్రబాబు గారు ఈయన్ని తన కేబినెట్‌లో రవాణా శాఖ మంత్రిగా కూడా తీసుకున్నారు. కాని కొన్నాళ్లకే ఎందుకో మళ్లీ ఆయన్ని డిప్యూటీ స్పీకర్‌గా మార్చారు. అప్పటి నుంచీ చంద్రశేఖరుడు అసంతృప్తితో ఏకంగా ప్రభుత్వంపైనే విమర్శనాస్త్రాలు సంధించటం మొదలెట్టారు. ఆ తర్వాత 'తెలంగాణా రాష్ట్ర సమితి' ని స్థాపించారు. ఆ తర్వాతి పరిణామాలు అందరికీ ఎరుకే.....

రాజశేఖరుని హయాంలో...

2004 ఏప్రిల్‌లో మరో మార్పు! ప్రభుత్వం వైజ్ఞానికంగా, సాంకేతికంగా ఎంత వేగంగా దూసుకుపోయినప్పటికీ సామాన్య ప్రజల సమస్యలను విస్మరిస్తే మాత్రం పుట్టగతులు ఉండవని 2004 అసెంబ్లీ ఎన్నికలు రుజువు చేశాయి. టి. ఆర్. ఎస్‌తో పొత్తు కుదుర్చుకున్న కాంగ్రెస్ విజయ ధంకా మ్రోగించింది. అనుకున్నట్టుగానే డా. రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రి అయ్యారు. స్కీములు మారాయి. సీనులూ మారాయి. సంక్షేమ పథకాల విషయం కొంత వరకు ఫరవాలేదనుకున్నా శాంతి భద్రతల పరిస్థితి మాత్రం బాగాలేదు. మరోవైపు ' తెలంగాణ ' పై స్పష్టత లోపించిన ప్రభుత్వ ప్రకటనలు గందరగోళానికి దారి తీస్తున్నాయి. ఏది ఏమైనా రాజ శేఖరుడి హయాంలో వర్షాలు మాత్రం బాగాపడ్డాయి. రిజర్వాయర్‌లు నిండాయి. కరెంటు సరఫరా కొంతవరకు మెరుగుపడింది. ప్రకృతి వైపరీ త్యాలు ఒక వంక రైతుల నడ్డి విరుస్తున్నా వ్యవసాయోత్పత్తులకు మాత్రం ధోకాలేదని ప్రభుత్వ గణాంకాలు చాటి చెబుతున్నాయి. ముస్లింల రిజర్వే షన్ సంగతి ఇప్పటికీ డోలాయమానంగానే ఉంది. ఇదీ స్థూలంగా ఆంధ్ర ప్రదేశ్ రాజకీయ ముఖచిత్రం!

(స్థలాభావం వల్ల ఈ విషయాన్ని ఇంతటితో చాలిస్తున్నాము. రాష్ట్ర ఆర్థిక, సామాజిక, ఆధ్యాత్మిక స్థితిగతుల గురించి మరోసారి సింహావలోకనం చేద్దాం.)

తీయటం, దర్గాలను, దగాకోరులను ఆశ్రయించటం మొదలైనవి ఈ కోవకు చెందినవే. వీరి గురించి అల్లాహ్ ఏమంటున్నాడో కాస్త గమనించండి.

"వారు స్వయంగా మార్గభ్రష్టత్వం కొనితెచ్చుకోవడమే కాక, మిమ్మల్ని కూడా భ్రష్టుల్ని చేయజూస్తున్నారు."

(దివ్య ఖుర్ఆన్- 4:44)

"వారిలో కొందరు నిరక్షరాసులు కూడా ఉన్నారు. వారికి గ్రంథ జ్ఞానం బొత్తిగా లేదు. అయినా వారు లేనిపోని ఆశలు కల్పించుకొని ఊహాకెరటాలపై తేలిపోతుంటారు."

(దివ్య ఖుర్ఆన్- 2: 78)

"వారిలో కొందరు దైవవాణిని చదివి అర్థం చేసుకున్నప్పటికీ, దాన్ని ఉద్దేశ్య పూర్వకంగా తారుమారు చేస్తుంటారు."

(దివ్య ఖుర్ఆన్- 2: 75)

రండి...! ఓ దురాచారాన్ని గురించి వచ్చే నెలలో కుణ్ణంగా తెలుసుకుందాం...!!



వినరా ! నరుడా !

-ముహమ్మద్ అమీన్

వినరా ! వినరా ! నరుడా !
తెలుసుకోరా ! పామరుడా !

చిల్లర దేవుళ్ళను మొక్కకురా !
చక్కనైన దేవుడొక్కడేరా !
ఒక్కడైన (అల్లాహ్) దేవుని మ్రొక్కరా !
వంచన లేని మంచిని పెంచరా !
నిను మించిన నరుడెవ్వడు లేడురా ! "వినరా"

ధర్మం తెలిసి బ్రతకరా !
దాన ధర్మాలు చేయరా !
నీతి, నిజాయితీల విలువలెరుగరా !
తల ఎత్తుకుని జీవించరా ! "వినరా"

సజావుగా నమాజు చేయరా !
చల్లని అల్లాహ్ ముందు తల వంచరా !
పశ్చాత్తాపం నీ పాపాలకు ప్రాయశ్చితంరా !
కరుణించే కరుణామయుడు అల్లాహ్ రా !"వినరా"

సాటివాని హక్కులు దోచకురా !
'జకాత్' విలువ లెరిగి పంచరా!
అల్లాహ్ ప్రీతికై ఉపవాసం చేయరా !
నీకై స్వర్గ వనాలు వేచియున్నవిరా ! "వినరా"




భ్రమల వలయం - 1

సయ్యద్ అబ్దుస్సలాం ఉమ్రీ

'నష్ఖతుల్ అరబ్'లోని ఓ క్యారెక్టర్ అష్‌అబ్. ఓ రోజు అష్‌అబ్ పిడుగుల్లాంటి పిల్లలతో పరేషాన్ అయిపోయాడు. వీరి నుండి ఎలాగైనా బ్రతికి బయట పడటానికి ఓ పథకం వేసుకున్నాడు. పిల్లలందరినీ పిలిచి "చూడండీ పిల్లలూ! మీరంతా నాతో ఉండి ఓ మంచి అవకాశాన్ని చేజార్చుకుంటున్నారు. ఎందుకంటే, ఊరి పొలిమేరల్లో పప్పు-బెల్లాలు, లడ్డూ-జాంగిరీలు పంచుతున్నారు. వెళ్ళండి ఆలస్యం చేయొద్దు" అన్నాడు.

ఈ వార్త విన్నదే ఆలస్యం పిల్లలందరూ మిఠాయిల కోసం ఉరుకో ఉరుకు అని పరుగు లంకించుకున్నారు. వారు వెళ్లిన కాసేపటికే అష్‌అబ్‌కి ఏం తట్టిందో ఏమోగానీ తానూ పిల్లల వెంబడి పరుగెత్తసాగాడు. ఇదంతా దూరం నుండి గమనిస్తున్న ఓ వ్యక్తి- "నువ్వెందుకు అలా పరుగెత్తుతున్నావు?" అని నిలదీయగా, "బహుశా నిజంగానే అక్కడ మిఠాయిలు పంచుతున్నారేమో!" అన్నాట్ట అష్‌అబ్.



ఈ పిట్ట కథ ద్వారా పుకారుకి - భ్రమకి మధ్య తేడా తెలుసుకోవచ్చు. పిల్లలు అష్‌అబ్ రేకెత్తించిన రూమర్ ప్రభావానికి లోనై పరుగెత్తారు. వారి ఈ ప్రతి స్పందనకు కారణం-ఓ గట్టి నమ్మకం ఊహ మరియు అజ్ఞానం, తెలియనితనం అయితే, అష్‌అబ్ కూడా పరుగెత్తడం అనేది కేవలం ఓ భ్రమ ప్రభావమే. అది తెలియనితనం ఎంతమాత్రం కాదు. అతని ఈ భ్రమ అన్నది మూర్ఖత్వం, పేరాశ లాంటి నకారాత్మక ఎమోషన్స్‌తో మిళితమైనది. ఈ తేడాను ఎందుకు ఎత్తి చూపాల్సి వచ్చిందంటే, మనసు చేసే గారడిని, ప్రజల్లో, సంఘంలో ప్రబలివున్న రూమర్స్‌ని అర్థం చేసుకునేందుకు ఇది దోహదపడుతుంది. ఈ వ్యత్యాసాన్ని విస్మరించిన మూలంగానే వదంతి అన్నది ఓ భ్రమగా రూపాంతరం చెందుతుంది. ఆ భ్రమే మానవ హృదయాల్లో గట్టిగా నాటుకుపోయి ఓ నమ్మకంగా స్థిరపడుతుంది. అలా అది అనేక సమస్యలకు దారి తీస్తుంది. ఇటువంటి పుకార్లను ముస్లింలు నమ్ముతూ వాటినే సరైన మార్గంగా భ్రమించి బ్రతుకుతున్నారన్నది నిరాకరించలేని నిజం. ప్రజల్లో ప్రబలివున్న ఈ భ్రమలను మూడు విధాలుగా విభజించవచ్చు.

(1) సాధారణ ప్రజల భ్రమలు
(2) విద్యావంతుల భ్రమలు
(3) పండితుల భ్రమలు

ఇక్కడ మనం మొదటి రకం భ్రమల్ని తెలుసుకుందాం.

ధర్మంలో లేని విషయాలు: ధార్మికంగా చూస్తే ఏ ఆధారం లేకుండా ఏర్పర్చుకున్న భ్రమలు 'బిద్‌అత్‌ల' (దురాచారాల) క్రిందికి వస్తాయి. అయితే ఈ ఆచారదురాచారాలను తుంగలో త్రొక్కేయాలని, మొగ్గలోనే తుంచేయాలని దృఢ సంకల్పంతో లేచిన ఉద్యమాలన్నీ విఫలమవ్వడం ఆశ్చర్యానికి గురిచేస్తుంది. బహుశా దీనికి గల ముఖ్యకారణం-ప్రజలు 'తసవ్వుఫ్' (వేదాంతం) కి ఇచ్చే ప్రాముఖ్యతే కావచ్చు. సూఫీలు అనబడే ఈ వర్గం 'ఖురానీ ఆమాల్' లాంటి దురాచారాల చాటున మంత్ర తంత్రాల- క్షుద్ర విద్యల విచిత్ర లోకాన్ని ప్రవేశపెట్టారు. ఇటు ప్రజల్లోని సామాన్యులు, ప్రముఖులు కూడా ఇలాంటి కార్యాలను 'బర్‌కత్' గా గొప్పవిగా భావిస్తూ వచ్చారు. నిశిత దృష్టితో గనక పరీక్షిస్తే అనేక ఖురానీ ఆమాల్ బహుదైవారాధనతో మలినమయి ఉన్నాయి. అయితే ప్రజల్లో ధర్మావగాహన లోపాన్ని, వారికి అరబ్బీ వాక్యాల అర్థం తెలియకపోవడాన్ని సువర్ణావకాశంగా భావించిన వంచకులు కొందరు వారిని వంచించి సొమ్ము చేసుకుని జేబులు నింపుకుంటున్నారు.

"రూహుల్ జఫర్" 174వ పేజీలో ఇలా ఉంది: "అన్ని రకాల మనో వాంఛల్ని తీర్చగలిగే విధానం ఇది; యా హువ, యా అల్లాహ్, యా సమద్, యా అహద్, **యా జిబ్రీల్.** (ఓ శక్తిమంతుడా! ఓ అల్లాహ్! ఓ నిరపేక్షా పరుడా! ఏకైక దేవుడా! **ఓ జిబ్రీల్!**)

చూశారా ! అల్లాహ్‌తో పాటు దైవ దూత జిబ్రీల్‌ను సైతం దైవత్వంలో చేర్చి ప్రజల ధర్మాన్ని ఎలా భ్రష్టుపట్టిస్తున్నారో!? ఇది కేవలం ఒక ఉదాహరణ మాత్రమే. ఇవీ, ఇలాంటి అనేక దురాచారాలు ఇస్లామీయ ఆచారాలుగా భావించబడుతూ ఉన్నాయి. ఇలాంటి దురాచారాలకి దైవం తరఫు నుండి, దైవ ప్రవక్త (స) గారి తరఫు నుండి ఎలాంటి ప్రమాణం లేనప్పటికీ - ఒకప్పుడు పుకార్లుగా, రూమర్స్‌గా ఉన్న ఈ దురాచారాలు భ్రమలుగా మారి నేడు ముస్లిం జనజీవనాన్నే శాసిస్తున్నాయి. పటిష్టమైన విశ్వాసంగా, ధర్మంలోని భాగంగా చెలామణి అవుతున్నాయి.

తమకు తోచిన విధంగా ఊహాగానాలు చేయటం అతి పెద్ద నేరంగా పరిగణించింది ఇస్లాం. అయినప్పటికిన్నీ ఈ వంచకులు అదే బాటన నడిచారు. ఖుర్‌ఆన్ ఆయతులను నీళ్ళలో నానబెట్టి త్రాగటం, స్నానం చేయటం, రక్తంతో వ్రాయడం, ఇంకా ఇంతకన్నా నీచ ప్రవృత్తికి పాల్పడటం, ఖురానీ -ఆమాల్ పేరిట తావీజులు, దండలు కస్టమర్ ఇచ్చే రేటుని బట్టి తయారు చేయటం, దివ్య వచనాలను సంఖ్యల్లో మార్చి వ్రాయటం, జెండాలు తీయటం, ఉరుసులు చేయటం, ఊరేగింపులు

మహనీయ ముహమ్మద్ ﷺ ఇలా ప్రబోధించారు:

ఐదింటిని ఐదింటికి ముందు మీరు మహా భాగ్యంగా భావించండి -

1) ఆరోగ్యానికి ముందు ఆరోగ్యాన్ని
2) వృద్ధాప్యానికి ముందు యౌవనాన్ని
3) కార్య నిమగ్నతకు ముందు తీరికను
4) చావుకి ముందు బ్రతుకుని
5) మరణానికి ముందు జీవితాన్ని







ఓ మానవుడా!

ఈ జీవితం క్షణభంగురం. రేపు నీ ఆరోగ్యం క్షీణిస్తుంది. వృద్ధాప్యపు ఛాయలు ప్రసూటమవుతాయి. క్షణం తీరిక లేని పరిస్థితి ఎదురవుతుంది. లేదా నీకు లేమి దాపురిస్తుంది. మృత్యువు నిన్ను కబళిస్తుంది. కడకు నీ తనువు బూడిదలో కలిసిపోతుంది.

ఆ పైన....

నీవు చేసిన కర్మ ఫలితమే నీకు తోడుగా మిగులుతుంది.

ప్రతిదీ తెలుసుకోగోరే ఓ మనిషీ !

నిన్ను నీవు తెలుసుకో.

నువ్వు చేయాల్సిందేమిటి? చేస్తున్నదేమిటి??

وَلَقَدْ كَرَّمْنَا بَنِي آدَمَ وَحَمَلْنَاهُمْ فِي الْبَرِّ وَالْبَحْرِ
وَرَزَقْنَاهُم مِّنَ الطَّيِّبَاتِ وَفَضَّلْنَاهُمْ عَلَىٰ كَثِيرٍ مِّمَّنْ
خَلَقْنَا تَفْضِيلًا (الإسراء: ٧٠)

"మేము ఆదం సంతతికి పెద్దలకాన్ని ప్రసాదించాము. వారికి నేలపైనా, నీటిలోనూ నడిచే వాహనాలను ఇచ్చాము. వారికి పరిశుద్ధమైన పదార్థాలను ఆహారంగా పొసగాము. మేము సృష్టించిన ఎన్నో ప్రాణులపై వారికి స్పష్టమైన ఆధిక్యాన్ని అనుగ్రహించాము".

(దివ్య ఖుర్ఆన్- 17: 70)





IPC
ISLAM PRESENTATION COMMITTEE
رحمة للعالمين

Ext. 110 2444117

www.thelastingmiracle.com


ఇంకా ...

వివిధ అంశాలపై ఎన్నో విలువైన కేసెట్లు,
ఫోల్డర్లు ఉచితంగా
సరఫరా చేయబడతాయి.


TELUGU BOOKS














మీకేవో సందేహాలు ఉన్నా, మీరు ఇస్లాంను అధ్యయనం చేయాలనుకున్నా మా ఉచిత సలహా కేంద్రాన్ని సంప్రదించండి.

IPC
ISLAM PRESENTATION COMMITTEE

Ext. 106 2444117

www.thelastingmiracle.com